

- నదిపై రెండు ప్రాంతాల్లో బ్రిడ్జి కమ్ బ్యారేజీలకు ప్రతిపాదన
- అనుకూలంగా నివేదిక ఇవ్వాలని ఇంజనీర్లపై ఒత్తిడి
- కేసీ కాలువ నీటి వాటాపై తీవ్ర ప్రభావం
- ఇప్పటికీ వెంటాడుతున్న ఆర్డీఎస్ ఆనకట్ట వివాదం
- అనుమతి ఇవ్వబోమంటున్న ప్రజాప్రతినిధులు

తుంగభద్ర జలాలపై కర్ణాటక కన్ను..!



తుంగభద్ర నదిపై చికలపర్వి బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి కర్ణాటక ప్రతిపాదించిన ప్రదేశం

కర్నూలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం 131.29 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించారు. జూన్ ఒకటో తేదీ నుంచి మే 31 వరకు ఒక నీటి సంవత్సరంలో కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ 212 టీఎంసీలు వినియోగించుకునేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యూనల్ (కేడబ్ల్యూడీటీ) అవార్డు-1 కేటాయింపుల ప్రకారం కర్ణాటక 138.99 టీఎంసీలు, ఏపీ, తెలంగాణ ఉమ్మడిగా 73.01 టీఎంసీలు వాడుకోవాలి. ఏపీ నీటి వాటా 66.50 టీఎంసీలలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీకి 24 టీఎంసీలు, కేసీ కాలువకు 10 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ ద్వారా 32.50 టీఎంసీలు కేటాయించారు. ఏటా టీబీ బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశమై డ్యాంలో చేరే వరదను అంచనా వేస్తుంది. కేడబ్ల్యూడీటీ కేటాయింపుల దామాషా ప్రకారం నీటి వాటా కేటాయిస్తారు. గత పదేళ్లలో డ్యాంలో చేరిన వరద లెక్కలు పరిశీలిస్తే ఏటా సగటున డ్యాంలో 160-180 టీఎంసీలకు మించి చేరడం లేదు. కేసీ కాలువకు కేటాయించిన నీటివాటాను తుంగభద్ర నది ద్వారానే తీసుకోవాల్సి ఉంది. పైగా తుంగభద్రకు ఏటేటా వరద దినాలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తుంగభద్రపై ఎగువన కర్ణాటక బ్యారేజీలు నిర్మాణం చేపడితే దిగువన ఉన్న కేసీ కాలువ ఆయకట్టుతో పాటు, నదీతీర గ్రామాలు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని రాయలసీమ సాగునీటి నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తుంగభద్ర జలాలపై ఎగువ రాష్ట్రం కర్ణాటక కన్నేసింది. ఇప్పటికే కొప్పల్ జిల్లా గంగావతి తాలుకా నవలి వద్ద 31 టీఎంసీల సామర్థ్యంలో నవలి జలాశయశం నిర్మాణానికి ఎత్తులు వేస్తోంది. డీపీఆర్ తయారీ కోసం రూ.13.40 కోట్లు కర్ణాటక ప్రభుత్వం ఇప్పటికే విడుదల చేసింది. దీనిని మన ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకించింది. తాజాగా తుంగభద్ర నదిపై చిలకపర్వి-కుంబళూరు మధ్య, చిన్నమంచాల-మంత్రాలయం మధ్య రెండు బ్రిడ్జి కమ్ బ్యారేజీల నిర్మాణాలకు కర్ణాటక సన్నాహాలు చేస్తోంది. వీటికి అనుకూలంగా నివేదిక ఇవ్వాలంటూ రెండు రోజులుగా కర్ణాటక అధికారులు కర్నూలులో మకాం వేసి మన ఇంజనీర్లపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ బ్యారేజీలు నిర్మిస్తే కేసీ కాలువ నీటివాటాపై తీవ్ర ప్రభావం ఉంటుందని సాగునీటి నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే ఆర్డీఎస్ ఆనకట్ట వివాదం వెంటాడుతోంది. మళ్లీ కొత్త జల వివాదాలకు తెర తీస్తారా..? అంటూ ప్రశ్నిస్తున్నారు. తుంగభద్రపై కర్ణాటక చేపట్టేబోయే బిడ్జి కమ్ బ్యారేజీలను అనుమతించమని మన ప్రజాప్రతినిధులు అంటున్నారు.

రెండు బ్రిడ్జి కమ్ బ్యారేజీలకు ప్రతిపాదనలు

కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి తాలుకా చికలపర్వి గ్రామం, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా కౌతాళం మండలం కుంబళనూరు గ్రామాలను కలుపుతూ తుంగభద్ర నదిపై రూ.397.50 కోట్ల ఖర్చుతో 0.35 టీఎంసీల సామర్థ్యంతో చికలపర్వి బిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి కర్ణాటక మైనర్ ఇరిగేషన్ శాఖ ప్రతిపాదన సిద్ధం చేసింది. అలాగే రాయచూరు జిల్లా చిన్నమంచాల, కర్నూలు జిల్లా ఆధ్యాత్మిక క్షేత్రం మంత్రాలయం మధ్య రూ.350 కోట్లతో 0.31 టీఎంసీల సామర్థ్యంలో రెండో చిన్నమంచాల బిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణాలను తెరపైకి తెచ్చింది. ఏపీ ఆమోదం లేకుండా వీటి నిర్మాణాలు చేపడితే భవిష్యత్తులో కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేసే అవకాశం ఉందని గ్రహించిన కర్ణాటక మైనర్ ఇరిగేషన్ ఇంజనీర్లు భావిస్తున్నారు. గత ఏడాది సెప్టెంబరు 11న కర్ణాటక మైనర్ ఇరిగేషన్, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ మంత్రి బోసరాజ్ జిల్లాకు చెందిన కొందరు ప్రజాప్రతినిధులు, ఇంజనీర్లతో సమావేశమయ్యారు. అప్పట్లో ఇది రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. తుంగభద్ర జలాలపై కన్నేసిన కర్ణాటక వ్యూహాత్మకంగా మనల్ని ఒప్పించి నీటిని తీసుకెళ్లేందుకు ఎత్తులు వేస్తుందని పలువురు పేర్కొంటున్నారు.

మిగతా 6వ పేజీలో..



కౌతాళం మండలం కుంబళనూరు వద్ద తుంగభద్రపై కర్ణాటక బ్యారేజీని ప్రతిపాదించిన ప్రాంతం గూగుల్ మ్యాప్

ఏక్ నిరంజన్..!

- నంద్యాలలో చర్చనీయాంశంగా మారిన మున్సిపల్ కమిషనర్
- నిన్న మాజీ సైనికుడు.. నాడు పెట్రోల్ బంక్ యజమాని
- నేడు ఓ సచివాలయ ఉద్యోగికి తిప్పలు
- సొంత శాఖ ఉద్యోగుల నుంచీ ఆరోపణలు
- కోర్టు వివాదంలో ఉన్న స్థలానికి పన్ను



నంద్యాల మున్సిపల్ కార్యాలయం (ఫైల్)

నంద్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డిపై ఉద్యోగరీత్యా పలు విమర్శలకు కేంద్రబిందువుగా మారారు. ఇటీవల ఆయనపై పలువురు ఆరోపణల నేపథ్యంలో ఇటు మున్సిపల్ శాఖ ఉద్యోగులు, ప్రజల్లో మున్సిపల్ కమిషనర్ చర్చనీయాంశంగా మారారు. వారం ఓ మాజీ సైనికుడి ఇంటి పన్ను మినహాయింపు నుంచి.. గతంలో ఓ పెట్రోల్ బంక్ నిర్వాహకుడు, తాజాగా ఓ సచివాలయ ఉద్యోగి సెలవు మంజూరు విషయం వరకు ఆయన వ్యవహరించిన తీరుపై బాధిత వర్గాలు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. వీటికితోడు ఓ మంత్రికి.. మరొకరికి చెందిన స్థలంపై ఎప్పటి నుంచో కోర్టు వివాదంలో ఉంది. అయితే గుట్టుచప్పుడు కాకుండా సదరు మున్సిపాలిటీ అధికారులు సదరు స్థలానికి పన్నులు వేయడం అప్పట్లో దుమారం రేపింది. ఏం జరిగిందో ఏమో కానీ కింద స్థాయి ఉద్యోగులను బలి చేసి వదిలేశారని సమాచారం. ఇలా నిత్యం ఏదో ఒక విధంగా నంద్యాల మున్సిపాలిటీతో పాటు సదరు కమిషనర్ తీరుపై పలు విమర్శలు వస్తుండటం సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. పైగా సదరు కమిషనర్ కూడా వీటన్నింటికి చెక్ పెట్టకపోవడం గమనార్హం. ఓ మాజీ సైనికుడి విషయంలో ఆయన వ్యవహరించిన తీరుపై కౌన్సిల్ సమావేశంలో కూడా చైర్‌పర్సన్‌తో పాటు టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు ప్రశ్నించారు.

మిగతా 6వ పేజీలో..

ప్రారంభమైన ఇంటర్ ప్రాక్టికల్స్

తొలి రోజు 99 మంది గైర్హాజర్



కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజున 99 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1,708 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఇందులో 1,609 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 99 మంది గైర్హాజరయారు. ఉదయం జరిగిన పరీక్షకు 974 మంది నమోదు చేసుకోగా, 911 మంది హాజరయ్యారు. ఇందులో 63 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షకు 734 మంది నమోదు చేసుకోగా, 698 మంది పరీక్షలకు హాజరయ్యారు. 36 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొదటి రోజు ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. కర్నూలు నగరంలోని కాంకర్డ్ జూనియర్ కళాశాల, కృష్ణవేణి కళాశాలలో జరిగే పరీక్ష కేంద్రాలను ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి, టౌన్‌మోడల్ కాలేజీ, కేవీఆర్ బాలికల కాలేజీలను డీవీఈవో పర మేశ్వరరెడ్డి, డీఈసీ సభ్యులు పర్యవేక్షించారు.

కష్టజీవులకు శాపంగా కేంద్ర బడ్జెట్

కలెక్టరేట్ ఎదుట కార్మిక సంఘాల నిరసన

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పార్లమెంటులో 2025-26కు సంబంధించి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కష్టజీవులకు శాపంగా మారిందని కార్మిక సంఘాల నాయకులు అన్నారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, కిసాన్ సంయుక్త మోర్చా జాతీయ సమితి పిలుపు మేరకు బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసనలో సీఐటీయూ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శులు ఎండి. అంజిబాబు, ఎస్. మునెప్ప మాట్లాడుతూ కార్మికులకు శాపంగా మారిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. రైతులు పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం చేయాలన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ సిఫారసులు అమలుకు ఎలాంటి నిధులు కేటాయించకుండా రైతులకు ఇబ్బంది పెట్టేలా బడ్జెట్ రూపకల్పన చేశారన్నారు. లేబర్ కోడ్ అమలు చేయాలనే ఆలోచనకు వ్యతిరేకంగా దేశంలోని కార్మిక వర్గం పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే. జగన్నాథం, ఏఐయుటీయూసీ జిల్లా కార్యదర్శి నాగన్న, ఏఐకేఎస్ జిల్లా నాయకులు రంగన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ రామాంజనేయులు, సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట నిరసనలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

కల్లు కార్మికులకు ఊరట..

- మద్యం దుకాణాల దరఖాస్తులకు లైన్ క్లియర్
- మద్దికెర, క్రిష్ణగిరి దుకాణాలకు నిల్
- 8 వరకు పొడిగింపు.. 10న జడ్పీలో లాటరీ ద్వారా ఎంపిక
- 10 దుకాణాలకు 12 దరఖాస్తులు

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కల్లు గీత కార్మికులకు హైకోర్టులో ఊరట లభించింది. మద్యం దుకాణాల లైసెన్సు ఖరారు చేయకుండా నిలువరించాలంటూ మద్యం దుకాణాల యజమానులు చేసిన అభ్యర్థనను హైకోర్టు తిరస్కరించింది. దీంతో కల్లు గీత కార్మికులకు ఉపశమనం లభించినట్టయింది. జిల్లాలో గీత కులాల10 దుకాణాలకు ఇప్పటి వరకు 12 మంది దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తుల స్వీకరణకు గడువును ఈనెల 8 వరకు పొడిగించారు. 10న జిల్లా పరిషత్ సమావేశ భవనంలో లాటరీ ప్రక్రియ ద్వారా దుకాణాల కేటాయింపు ప్రక్రియ చేపడతారు. గీత కులాలకు లైసెన్స్ ఫీజులో రాయితీ ఇవ్వడంపై కొంత మంది కోర్టును ఆశ్రయించారు. దానిపై వాదనలు విన్న హైకోర్టు రెండు వారాల తర్వాత కౌంటర్ దాఖలు చేయాలని కోరిన విషయం తెలిసిందే. తీర్పు గీత కార్మికులకు అనుకూలంగా రావడంతో యథావిధిగా గీత కార్మికుల దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతోంది. దుకాణాలు పొందిన వారికి లైసెన్సు ఫీజులో 50 శాతం రాయితీతో పాటు గడిచిన నాలుగు నెలల కాలానికి ఫీజు మినహాయింపు కూడా ఉంటుందని చెప్పారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 65 లక్షలు లైసెన్సు ఉన్న ప్రాంతంలో 50 శాతం ఫీజు మినహాయింపు ఉంటుంది. అంటే రూ. 32.50 లక్షలు కాగా దానిలో నాలుగు నెలల లైసెన్సు ఫీజు మినహాయిస్తే రూ. 21,66,667 మద్యం దుకాణదారులు చెల్లించాల్సి వస్తుంది. ఇప్పటికే జిల్లాలోని 10 మద్యం దుకాణాలకు 12 దరఖాస్తులు వచ్చాయి. మద్దికెర, క్రిష్ణగిరి మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఈనెల 8 లోపు దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని, దరఖాస్తు కోసం ప్రత్యేక కౌంటర్లు పెడుతున్నామని ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ ఎం. సుధీర్ బాబు తెలిపారు.

అనధికార లేఅవుట్లపై ఉక్కుపాదం

- భవన నిర్మాణాలకు అనుమతులు తప్పనిసరి
- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనధికార లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్(కుడా) సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. బుధవారం కుడా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు సత్వర ప్రయోజనాలు చేర్చేందుకు ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ప్రవేశపెట్టిందన్నారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ద్వారా సమూలమైన మార్పులు తీసుకువచ్చిందన్నారు. లే అవుట్ అనుమతులు మంజూరులో పారదర్శకతతో పాటు కొన్ని నిబంధనలను సడలిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రోడ్డు వెడల్పును 30 అడుగుల వెడల్పు గల కనీస రోడ్లను ఏర్పాటు చేయాలని సూచించిందన్నారు. నీటి పారుదల శాఖ, నేషనల్ హైవే తదితర శాఖల ద్వారా అవసరమైన నిరభ్యంతర పత్రాలను త్వరితగతిన పొందేందుకు మార్గదర్శకాలు జారీ చేసిందన్నారు. భవన నిర్మాణ అనుమతుల మంజూరులో ప్రస్తుతం ఉన్న కఠినతర నిబంధనలను సరళతరం చేసిందన్నారు. నూతన విధానంతో భవన నిర్మాణ అనుమతులను మున్సిపల్ శాఖచే రిజిస్ట్రేషన్ పొందిన ఇంజనీర్లు/ప్లానర్లు-లైసెన్సుడు టెక్నికల్ పర్సన్‌ల ద్వారా తక్షణమే అనుమతులు మంజూరు ఆన్‌లైన్‌లో పొందవచ్చన్నారు. కుడా పరిధిలోని 896 గ్రామ పంచాయతీల పరిధిలో 300 చదరపు మీటర్ల విస్తీర్ణం వరకు స్థలంలో భవన నిర్మాణ అనుమతులు ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శుల ద్వారా ఆన్‌లైన్ పొందవచ్చన్నారు. రెండేళ్ల క్రితం నుంచి ఉమ్మడి జిల్లాలో అక్రమ అవుట్లు అధికమయ్యాయన్నారు. మంత్రాలయం నియోజకవర్గ కేంద్రంలో 115 మందికి నోటీసులు జారీ చేశామన్నారు. నోటీసులు తీసుకున్న 15 రోజుల లోపల మిగిలిన వారందరు అనుమతులు తీసుకోకపోతే కూల్చివేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 278 అక్రమ లేఅవుట్లను గుర్తించినట్లు సోమిశెట్టి వెంకటేశ్వర్లు వెల్లడించారు.

బెటాలియన్ కమాండెంట్‌గా దీపిక బాధ్యతల స్వీకరణ

కర్నూలు క్రైం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్పీ రెండో బెటాలియన్ కమాండెంట్‌గా ఎం.దీపిక పాటిల్ బుదవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా పని చేస్తున్న ఈమెను రాష్ట్ర ప్రభుత్వం కర్నూలుకు బదిలీ చేసింది. గతంలో ఈమె కర్నూలు ఏఎస్పీగా పని చేశారు.



ప్రస్తుతం ఉన్న కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్, దీపికలు భార్యభర్తలు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు బెటాలియన్ అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

వంద రోజులు పని కల్పించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, పిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా.. ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలను కల్పించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఉపాధి హామీ పనులు పురోగతి అంశంపై ఏపీడీలు, ఎంపీడీవోలు, ఏపీవోలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి రోజు లక్ష మందికి ఉపాధి పనులు కల్పించాలన్నారు. అలాగే సగటు వేతనం రూ.290కి పైగా వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సభలు నిర్వహించి కూలీలకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామసభలు ఏర్పాటు చేసినట్లు ఫొటోలు కూడా గ్రూప్‌లో పోస్టు చేయాలన్నారు. వెల్దుర్తి, ఓర్వకల్లు, ఆదోని, కృష్ణగిరి, నందవరం, కోసిగి, ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు మండలాల్లో ఎక్కువ పనిదినాలు కల్పించాల్సి ఉందన్నారు. ఫిబ్రవరి చివరి నాటికి మినీ గోకులాల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో డ్వామా పీడీ వెంకటరమణయ్య కూడా ఉన్నారు.

పీఎంఏజీ పథకానికి 28 గ్రామాల ఎంపిక

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో 22 మండలాల్లోని 28 గ్రామాలను పీఎంఏజీ(ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ) పథకానికి కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసినట్లు జడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి తెలిపారు. ఆయా గ్రామాలకు సంబంధించిన ఎంపీడీఓలు, కార్యదర్శులకు బుధవారం జడ్పీలోని మినీ సమావేశభవనంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ ఎంపికైన ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.20 లక్షలు నిధులు పీఎంఏజీవై కింద మంజూరు చేస్తారన్నారు. గ్రామాల్లో సర్వే చేసి అవసరమైన పనులను గ్రామసభ ద్వారా గుర్తించి విలేజ్ డెవలప్‌మెంట్ ప్లాన్(వీడీపీ) తయారు చేసి కలెక్టర్‌కు పంపితే పరిపాలన విభాగం అనుమతులు మంజూరవుతాయన్నారు. ఈ పథకానికి సోషల్ వెల్ఫేర్ శాఖ అధికారి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. రెండు రోజుల్లో నివేదికలు తయారు చేసి పంపాలని సీఈఓ ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటి సీఈఓ వెంకటసుబ్బారెడ్డి, ఎంపిడీఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ నాసరరెడ్డి

ఎంపీడీవోపై విచారణ



వివరణ తీసుకుంటున్న డీఎల్‌పీవో

దేవనకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దేవనకొండ మండల ఎంపీ డీఓపై జిల్లా స్థాయి అధికా రులు బుధవారం విచారణ చేపట్టారు. ఎంపీడీవో సూర్యనారాయణ తనకు మెమోలు ఇస్తూ, తన కారు ఎక్కాలంటూ నిత్యం వేధిస్తున్నాడంటూ మంగళవారం కర్నూలులో కరిడికొండ పంచాయతీ కార్యదర్శి రుబిక ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు ఎంపీడీవో సూర్యనారాయణపై డీఎల్‌పీవో లక్ష్మి, సీడీపీవో మద్దమ్మ ఎంపీడీవో కార్యాలయంలో ఇద్దరినీ వేర్వేరుగా విచారించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు వెల్లడించారు.

రోడ్డు భద్రత.. మన బాధ్యత

కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రి ఓల్డ్ సీఎల్‌జీలో వైద్య సిబ్బందితో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు రహదారి భద్రతకు సంబంధించిన సీట్ బెల్టు, హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ఎవరికైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే ఆసుపత్రికి తరలించాలని, అలా చేయడం వల్ల ఒక వ్యక్తి ప్రాణాలు కాపాడవచ్చునన్నారు. డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ శాంతి కుమారి మాట్లాడుతూ డ్రైవింగ్‌లో నైపుణ్యం సరిగ్గా లేకపోవడం, రోడ్డు భద్రత జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరుగుతాయన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడకూడదన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు మద్యం తీసుకోవద్దని, హెల్మెట్, సీటు బెల్టులు ఎల్లప్పుడూ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ, సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి. వెంకటేశ్వరరావు, కర్నూలు ఆర్డీవో భరత్ చౌహన్, ట్రాఫిక్ సీఐ డీఎస్పీ మన్సూరుద్దీన్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

- కలెక్టర్ పి. రంజిత్ బాషా పిలుపు
- స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనం ప్రారంభం



నూతన స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): యువత నైపుణ్యాలను పెంపొందించుకుని ఉపాధి అవకాశాలను పొందాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. బుధవారం బి.తాండ్రపాడులోని కెనరా బ్యాంకు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ భవనాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం శిక్షణా సంస్థలోని వర్క్‌షాపులు, జెంట్స్ డార్మెంటరీ, లేడీస్ డార్మెంటరీ, లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్స్‌ను ప్రారంభించి పరిశీలించారు. శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థినులకు యూనిఫామ్, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ యువతలో ఉన్న నైపుణ్యాలను వెలికి తీయడానికి కెనరా బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా వివిధ అంశాల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 10వ తరగతి, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 45 సంవత్సరాల యువకులు పలు కోర్సుల్లో శిక్షణ కార్యక్రమాలు నడుస్తాయన్నారు. పురుషులకు టూవీలర్ మోటారు సైకిల్ సర్వీసింగ్, రిపేరు, సెల్‌ఫోన్ సర్వీసింగ్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, ఎలక్ట్రికల్ హోం వైరింగ్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తారన్నారు. మహిళలకు టైలరింగ్, డ్రెస్ డిజైనింగ్, బ్యూటీషియన్ తదితర కోర్సులలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణతో పాటు భోజన వసతి సదుపాయాలను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ సుశాంత్ కుమార్, శిక్షణ సంస్థ డైరెక్టర్ పుష్ప కుమార్, ఎల్డీఎం రామచంద్రరావు, డీఆర్డీఏ పీడీ నాగశివలీల, విద్యార్థినులు పాల్గొన్నారు.

'సాహిత్య పాఠశాల'ను విజయవంతం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): విప్లవ రచయిత సంఘం (విరసం) ఆధ్వర్యంలో ఈనెల 8, 9వ తేదీల్లో నగరంలో గుత్తి పెట్రోల్ బంక్ సమీపంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న 'విరసం 24వ సాహిత్య పాఠశాల' సమావేశాలను విజయవంతం చేయాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని సి.క్యాంపులోగల టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విరసం బాధ్యులు పాణి, నాగేశ్వరాచారి, ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, రాయలసీమ విద్యావంతుల వేదిక నాయకుడు రత్నం ఏసేపు, కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు సుబ్బరాయుడు, జేవీవీ బాధ్యుడు సుంకన్న, పోస్టల్ యూనియన్ నాయకులు గిరి, మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'సంక్షోభ సమయంలో సాహిత్యకారుల పాత్ర' అనే ఇతివృత్తంతో ఏర్పాటు చేసిన ఈ రెండు రోజుల సాహిత్య పాఠశాల కార్యక్రమాల్లో వక్తలుగా ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ సాయిబాబా సహచరి వసంత, రచయిత అల్లం రాజయ్య రెండు తెలుగు రాష్ట్రాల నుంచి కవులు, కళాకారులు హాజరవుతారని తెలిపారు. దేశంలోని సమకాలీన రాజకీయాలు, సంక్షోభ సందర్భాలు మొదలైన అంశాలపై ప్రసంగాలు, చర్చలు, కవితా సమ్మేళనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ సమావేశాలకు రచయితలు, విద్యార్థులు, సాహిత్యాభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

19 నుంచి టీసీసీ పరీక్షలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): జిల్లాలో టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (టీసీసీ) పరీక్షలు ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ బుధవారం తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్ (లోయర్, హైయర్) పరీక్షలు గుర్తింపు పొందిన పరీక్ష కేంద్రాల్లో జరుగుతాయన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు హాల్ టికెట్లను డౌన్‌లోడ చేసుకుని హాజరు కావాలన్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందన్నారు. వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు తప్పనిసరిగా పాస్‌పోర్టు, పాన్ కార్డు కానీ, ప్రభుత్వం జారీ చేసిన ఏదేని ఒక ఒరిజినల్ చెల్లుబాటయ్యే గుర్తింపు కార్డుతోపాటు ఓటర్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్సులను వెంట తెచ్చుకోవాలని సూచించారు.

మనసు పదిలంగా ఉండాలి



- విద్యార్థులు పరీక్షల ఒత్తిడిని తగ్గించుకోవాలి
- పరీక్షల మధ్య విరామంతో ఉపశమనం
- జిల్లా 38,560 మంది విద్యార్థులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పరీక్షలు దగ్గరపడుతున్న కొద్దీ విద్యార్థులకు ఒత్తిడి పెరగడం సహజం. పదో తరగతి విద్యార్థుల్లో అది మరి ఎక్కువ. రాత్రంతా కష్టపడి చదివినదంతా పరీక్ష రాసే సమయంలో మర్చిపోతుంటామని ఆందోళన చెందుతుంటారు. విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయడానికి సిద్ధమైన కూటమి ప్రభుత్వం పదో తరగతి విద్యార్థుల అంతర్మథనాన్ని గమనించింది. ఓ చక్కటి ప్రణాళికను రూపొందించి మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పరీక్షలను నిర్వహిస్తున్నట్లు షెడ్యూల్‌ను విడుదల చేసి, ప్రతి పరీక్షకు మధ్యలో ఒక రోజు విరామం ఉండేలా ప్రణాళికను సిద్ధం చేసింది. ఈ షెడ్యూల్ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు ఉపకరిస్తుందని ఉపాధ్యాయులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 514 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి మొత్తం విద్యార్థులు 38560 మంది ఉన్నారు.

సమయం ఆదా..

ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి మార్చి 17 నుంచి 31వ తేదీ వరకు పది పబ్లిక్ పరీక్షలు జరుగనున్నాయి. ప్రతి పరీక్షకు మధ్యలో ఒక రోజు విరామం ఉంచారు. మధ్యలో సెలవులు రావడం ద్వారా విద్యార్థులపై ఒత్తిడి తగ్గనుంది. ఒక్కోసారి రెండు, మూడు రోజులు సెలవులు కలిసి వచ్చాయి. దీంతో తర్వాత పరీక్షకు హాజరవడానికి తగిన సమయం, పాఠ్యాంశాల పునశ్చరణకు అవకాశం ఉండడంతో విద్యార్థులకు ఊరట కల్గింది.

గతంలో తీవ్ర ఒత్తిడి...

గతంలో పదో తరగతి షెడ్యూలులో పండుగలు, వారాంతపు సెలవులు ఉండేవి. అలా నిర్వహించే షెడ్యూల్ వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేవారు. ఇది ఇలా ఉంటే కొన్నేళ్ల నుంచి పాఠ్యాంశాలకు రెండు పేపర్ల విధానం తొలగించి ఒక పేపర్ మాత్రమే నిర్ధారించి పరీక్షలు నిర్వహించడం వారిని మరింత ఇబ్బందుల్లోకి నెట్టినట్లయింది. దీని వల్ల వరస పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అయోమయ స్థితికి చేరుకుని మార్కుల సాధనలో వెనుకబడిపోయారు. మరి కొందరైతే పరీక్షల్లో విఫలమయ్యారు.

సిలబస్‌ను రివిజన్ చేసుకునేందు అవకాశం

పరీక్షల మధ్యలో సెలవులు రావడం వల్ల పూర్తి సిలబస్‌ను రివిజన్ చేసుకునేందుకు ఇది మంచి అవకాశం. వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉండడంతో నేర్చుకున్న పాఠ్యాంశాలను మరోసారి చదువుకునేందుకు వీలు ఉంటుంది. గతంలో 50 మార్కులకు పేపర్ ఉండడంతో గ్యాప్ ఉండేది కాదు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విద్యార్థుల భవిష్యత్తును ఆలోచించి నిర్ణయం తీసుకున్నారు. పది పరీక్షల నిర్వహణకు ఒక్కో రోజు విరామం రావడం ఇదే తొలిసారి. విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గి ప్రశాంతంగా పరీక్ష రాసేందుకు వీలు కలుగుతుంది.



-జిల్లా పరీక్షల విభాగం సహాయ కమిషనర్ జి. చంద్ర భూషణ్

తుంగభద్ర జలాలపై కర్ణాటక కన్ను..!

(5వ పేజీ తరువాయి)

చికలపర్వి-కుంబళనూరు మధ్య తుంగభద్ర నదిపై నిర్మించబోయే బ్రిడ్జి కమ్ బ్యారేజీ నిర్మాణానికి అనుకూలంగా నివేదిక ఇవ్వాలంటూ ఆ రాష్ట్రం కొప్పల్ జిల్లా మైనర్ ఇరిగేషన్ ఈఈ, డీఈఈల బృందం రెండు రోజులుగా కర్నూలులో మకాం వేశారు. జలవనరుల శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా, కర్నూలు సర్కిల్ ఎస్ఈ ద్వారకనాథ్‌రెడ్డిలను విన్నవించారు. ఈ బ్యారేజీ నిర్మాణం వల్ల కర్ణాటక, ఏపీ రాష్ట్రాల్లో నదీతీరంలోని 40 గ్రామాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా తాగునీటి సమస్య తీరుతుందని కర్ణాటక వాదన. అయితే తుంగభద్ర డ్యాం నుంచి కేసీ కాలువ నీటివాటా 10 టీఎంసీల మేర నదిగుండానే తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం డ్యాంలో ఒక టీఎంసీ విడుదల చేస్తే సుంకేసుల బ్యారేజీకి అర టీఎంసీ కూడా చేరడం లేదు. అదే క్రమంలో ఆర్డీఎస్ ఆనకట్ట వివాదం వెంటాడుతూనే ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో డ్యాం దిగువన 144 కి.మీల వద్ద కర్ణాటక బ్యారేజీ నిర్మాణం చేపడితే కేసీ కెనాల్ ఆయకట్టు రైతులతో పాటు నదీతీర గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అంతేకాదు కర్ణాటక వైపున ఆ రాష్ట్రం ఎత్తిపోతల ద్వారా తుంగభద్ర జలాలు తరలించుకుపోయే ప్రమాదం లేకపోలేదు. భారీ వరదలు వస్తే తప్ప బ్యారేజీ దాటి దిగువకు నీరు వచ్చే అవకాశం ఉండదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు కూడా ఈ బ్యారేజీని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కర్ణాటక ప్రతిపాదనలను ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించబోమని ఏపీ ఇంజనీర్లు అంటున్నారు.

అలగనూరుకు రూ.36.26 కోట్లు ఇవ్వండి

- రాష్ట్ర ప్రభుత్వానికి సీఈ ప్రతిపాదన
- వైసీపీ హయాంలో మరమ్మతులపై అంతులేని నిర్లక్ష్యం
- మరమ్మతులపై ఎమ్మెల్యే గౌరు చరిత పట్టు



అలగనూరు జలాశయం

కర్నూలు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అలగనూరు జలాశయం శాశ్వత మరమ్మతుల కోసం రూ.36.26 కోట్లు నిధులు ఇవ్వాలంటూ జలవనరుల శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా బుధవారం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. తక్షణ మరమ్మతులు చేపట్టడంతో నీటిని నిల్వ చేయవచ్చని ప్రభుత్వానికి పంపిన నివేదికలో పేర్కొన్నారు. కేసీ కాలువ పరిధిలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో 1,73,627 ఎకరాలు, కడప జిల్లాలో 92,001 ఎకరాలు కలిపి 2,65,628 ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందుతుంది. ఉమ్మడి కర్నూలు, కడప జిల్లాల్లో 259 గ్రామాలకు జల ప్రయోజనాలు అందించే కేసీ కాలువకు కేడబ్ల్యూడీటీ అవార్డు (జస్టిస్ బచావత్ అవార్డు)-1 ప్రకారం 31.90 టీఎంసీలు నికర జలాల వాటా ఉంది. అయితే రబీ సీజన్‌లో కడప జిల్లాలో ఆయకట్టుకు సాగునీరు అందని దైన్యంగా మారుతుంది. చివరి ఆయకట్టు రైతుల కష్టాలు తీర్చాలనే లక్ష్యంగా మిడ్తూరు మండలం అలగనూరు సమీపంలో 2.965 టీఎంసీల సామర్థ్యంతో అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించారు. కేసీ కెనాల్ నుంచి 119.65 కిలోమీటరు వద్ద ఇన్‌లెట్ చానల్ ద్వారా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి నీటి మళ్లిస్తున్నారు. 2005లో తొలి సారిగా నిర్ధేశిత సామర్థ్యం మేరకు నీటిని నింపుతున్నారు. వేసవిలో అలగనూరు రిజర్వాయర్ నుంచి కుందూ నదికి విడుదల చేసి రాజోలి ఆనకట్టకు నీటిని తరలించి కడప జిల్లాలో కేసీ ఆయకట్టుకు సాగునీరు ఇవ్వడం ఈ జలాశయం ప్రధాన లక్ష్యం. నంద్యాల జిల్లాలో గడివేముల, బండిఆత్మకూరు మండలాల రైతులకు ప్రయోజనం కలుగుతుంది.

నిర్లక్ష్యం చూపిన గత ప్రభుత్వం

కీలకమైన ఈ జలాశయం 2917లో 2.50 కి.మీల నుంచి 2.75 కి.మీల వరకు సుమారు వంద మీటర్లు మట్టికట్ట కుంగిపోయింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.38 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీటిని నింపింది. 2019లో మరోసారి తాత్కాలిక మరమ్మతులు చేశారు. రూ.3 కోట్లతో శాశ్వత మరమ్మతులు పనులు చేపట్టారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు ఆపేశారు. రూ.25.47 కోట్లతో మళ్లీ ప్రతిపాదనలు పంపించారు. ప్రభుత్వం నిధులు ఇవ్వలేదు. ఐదేళ్లలో గంపెడు మట్టి కూడా తీయలేదు. డ్యాం భద్రతా నిపుణులు కేవీ సుబ్బారావు, రైతు సత్యనారాయణ నేతృత్వంలోని నిపుణులు కమిటీ, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ (డీఎస్ఆర్‌పీ) నిపుణుడు ఏబీ పాండ్య కమిటీలు అలగనూరు జలాశయాన్ని సందర్శించి శాశ్వత మరమ్మతులపై పలు సూచనలు చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అలగనూరు జలాశయం శాశ్వత మరమ్మతులు చేపట్టి నీటిని నింపాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. అదే సమయంలో ఐఏబీ, జడ్పీ సమావేశాల్లో కూడా గళమెత్తారు. ఇంజనీర్లు స్పందించి శాశ్వత మరమ్మతులకు రూ.36.26 కోట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసి వచ్చే వేసవిలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్ల నిర్లక్ష్యం వల్ల జలాశయం చుక్కనీరు లేకుండా ఒట్టిపోయింది. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ఆ పరిస్థితి రాకుండా మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏక్ నిరంజన్..!

(5వ పేజీ తరువాయి)

కమిషనర్ తీరు మొదటి నుంచి వివాదాస్పదంగా ఉందని ఆ శాఖ వర్గాల నుంచి అభిప్రాయం వ్యక్తమవుతోంది. నగరానికి చెందిన ఓ మాజీ సైనికుడు తన ఇంటికి సంబంధించి పన్ను మినహాయింపు ఇవ్వాలని పలుమార్లు మున్సిపాలిటీ చుట్టూ తిరిగాడు. ఏమాత్రం పట్టించుకోలేదు. చివరికి ఒక రోజు కార్యాలయం వద్ద కళ్లు తిరిగి పడిపోవడం హాట్ టాపిక్‌గా మారింది. ఆ తర్వాత సదరు మాజీ సైనికుడు చనిపోయాడు. ఇంతలోనే సదరు ఇంటికి సంబంధించి పన్నుల మినహాయింపు ఇస్తూ సదరు కమిషనర్ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయంపై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలోనూ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో పాటు టీడీపీ, వైసీపీ కౌన్సిలర్లు కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో సదరు ఆయన బాధిత కుటుంబ సభ్యులకు క్షమాపణ కోరారు. ఇదే క్రమంలో ఓ పెట్రోల్ బంక్ నిర్వాహకుడు తమ పెట్రోల్ బంక్ వద్ద డివైడర్‌ను తొలగించాలని కమిషనర్‌ను కలిశారు. ఈ క్రమంలో కమిషనర్ డబ్బులు డిమాండ్ చేయడంతో కొంత అమౌంట్ ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆ తర్వాత కూడా పని కాకపోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో కమిషనర్ ప్రకాశం జిల్లాలో పనిచేసే సమయంలో ఓ పెట్రోల్ బంక్ అనుమతి కోసం రూ.లక్షలు తీసుకున్నారని చెప్పడంతో పాటు తాజాగా డివైడర్లు తొలగించడం కోసం రూ. 50 వేలు ఇచ్చారని వీడియో ద్వారా వైరల్ చేశారు. ఇదే క్రమంలో నంద్యాల మల్దార్‌పేట సచివాలయంలో ప్లానింగ్ సెక్రటరీగా పనిచేస్తున్న జయలక్ష్మి తమ కుమారుడికి ఆరోగ్యం సరిగ్గాలేదని తమ సచివాలయ అడ్మిన్‌తో పాటు కమిషనర్ నుంచి కూడా అనుమతి తీసుకున్నాను. కానీ తన కుమారుడికి ఆరోగ్యం కుదట పడకపోవడంతో సెలవును మరింత పొడిగించాలని కోరడంతో అడ్మిన్ కమిషనర్‌ను కలవాలని సూచించారు. దీంతో బాధిత ఉద్యోగి సోమవారం సదరు కమిషనర్‌ను కలిస్తే.. 'నా పర్మిషన్ లేకుండా సెలవు ఎలా తీసుకున్నావ్..' అంటూ పలు రకాలుగా మండిపడినట్లు సమాచారం. ఈ క్రమంలో ఏమీ చేయలేక బాధిత ఉద్యోగి జరిగిన వ్యవహారంపై ఆవేదన వ్యక్తం చేసింది. 'అన్ని అనుమతులతో సెలవు తీసుకున్నా. నా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయి. అయినా కూడా నా జీతాన్ని హోల్డ్ చేశారు. నాకు న్యాయం చేయండి...' అంటూ మీడియా ఎదుట వాపోయింది. ఇలా పలు రకాలుగా ఉన్నతాధికారి వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు మున్సిపల్ శాఖ ఉద్యోగులు బయటకు చెప్పుకోలేక సతమతమవుతున్నారు.

కోర్టు వివాద స్థలంపై పన్నులు..

సాధారణంగా ఎవరైనా వెళ్లి పన్నులు వేయాలని మున్సిపాలిటీకి వెళ్తే పలు రకాలుగా పరిశీలించి వేస్తారు. అయితే కొన్ని నెలల కిందట ఏకంగా ఓ మంత్రికి.. మరొకరికి చెందిన స్థలం కోర్టులో ఉన్నప్పటికి సదరు మున్సిపాలిటీ పన్నులు వేయడం పలు విమర్శలకు దారి తీసింది. ఈ క్రమంలో కమిషనర్‌పై తీవ్ర స్థాయిలో సదరు మంత్రి మండిపడినట్లు తెలిసింది. అయితే చివరికి కొందరు కింద స్థాయి ఉద్యోగులకు బలి చేసి ఉన్నతాధికారులు చేతులు దులుపుకున్నారనే విమర్శలు లేకపోలేదు. ఏది ఏమైనా కోర్టులో ఉన్న స్థలంపై పన్నులు వేయడంపై అప్పట్లో పలు రూపాలుగా విమర్శలు జోరందుకున్నాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం

నంద్యాల మున్సిపల్ కమిషనర్‌పై వచ్చిన కొన్ని అభియోగాలు, పిర్యాదులపై ఉన్నతాధికారులకు నివేదించాం. భవిష్యత్‌లో ఎలాంటి విమర్శలు, ఆరోపణలు లేకుండా చూసుకోవాలని సూచించాం. ప్రజలకు, ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో సేవలు అందించేలా చూస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పక పాటిస్తాం. ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలి. ఎవరైనా నిబంధనలకు అతిక్రమించి పనిచేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

- విశ్వనాథ్, మున్సిపల్ శాఖ రీజనల్ డైరెక్టర్

శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు : డీఎం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



నంద్యాల మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రాలకు నంద్యాల జిల్లా నెలవు. శివరాత్రి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శ్రీశైలం, మహానంది, నంద్యాల, యాగంటి తదితర శైవ క్షేత్రాలకు వేలాదిగా తరలివస్తుంటారు. ఈ క్రమంలో ప్రజా రవాణా వ్యవస్థ చాలా కీలకంగా వ్యవహరిస్తుంది. శివరాత్రి సందర్భంగా ప్రయాణికులకు అందించే సేవల గురించి నంద్యాల ఆర్టీసీ డిపో మేనేజర్ అల్లాడి గంగాధర రావుతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ.

ఆంధ్రజ్యోతి: శివరాత్రి సందర్భంగా ఎన్ని బస్సులు నడుపుతారు?

డీఎం: శైవ క్షేత్రాలను సందర్శించే భక్తులు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి 5 నిమిషాలకు ఒక బస్సు సర్వీసును కొనసాగిస్తాం.

ఆంధ్రజ్యోతి: ఏ శైవ క్షేత్రాలకు ఎన్ని బస్సులు?

డీఎం: శ్రీశైలానికి 20 బస్సులు, ఓంకారంతో పాటు భోగేశ్వరానికి ఒక బస్సు ఉంటుంది. రద్దీని బట్టీ ఈ క్షేత్రాలకు అదనపు బస్సులు నడుపుతాము. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేసుకున్నాం.

ఆంధ్రజ్యోతి: ఇతర శాఖల సహకారం ఎలా ఉంది?

డీఎం: శివరాత్రి సందర్భంగా సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్డీఓ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులు ప్రయాణించే మార్గంలో జంగిల్ క్లియరెన్స్ చేయటంతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఉన్న చోట జీబ్రా లైన్లు వేయడంతో పాటు రహదారుల్లో గుంతలు పూడ్చమని ఆర్‌అండ్‌బి అధికారులను కోరాం. రాత్రివేళల్లో ఆయా గ్రామాల మార్గాల్లో వీధి లైట్లు వెలిగేలా చూడాలని విద్యుత్ అధికారులను కోరాం.

ఆంధ్రజ్యోతి: ప్రయాణికులకు మీరు అందించే ఇతర సేవలేవైనా ఉన్నాయా?

డీఎం: ఆర్టీసీ ప్రయాణికుల సౌకర్యార్థం ఇటీవల ప్రభుత్వం వాట్సప్‌లో టికెట్ బుకింగ్ సేవలు తెచ్చింది. ప్రయాణికులు 95523 00009 అనే వాట్సప్ నెంబర్‌కు హాయ్ అనే మెసేజ్ పెడితే అందుబాటులో ఉన్న ఆర్టీసీ సేవలు కనిపిస్తాయి. అందులో బుకింగ్/రద్దు అనే ఆప్షన్‌ను ఎంపిక చేసి తమ తమ ప్రయాణ ప్రదేశం, గమ్యస్థానం, తేదీ టైప్ చేస్తే అందుబాటులో ఉన్న బస్సుతో పాటు సీట్ల వివరాలను ప్రయాణికులు పొందవచ్చు. ఎంపిక తర్వాత డిజిటల్ చెల్లింపు చేస్తే ప్రయాణికుడి వాట్సప్‌కు బస్ టికెట్ వస్తుంది. వాట్సప్ సేవలు ఉపయోగించుకుని ప్రయాణికులు తమ విలువైన సమయాన్ని కాపాడుకోవచ్చు.

నేటి నుంచి బాలోత్సవం



కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5: (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో కర్నూలు బాలోత్సవ కార్యక్రమాలు ప్రారంభమవుతున్నట్లు బాలోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు రవీంద్ర పుల్లయ్య, ప్రధాన కార్యదర్శి జేఎస్ శేషయ్య, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్ తెలిపారు. రెండు రోజుల పాటు జరగనున్న ఈ వేడుకలకు 2వేలమంది విద్యార్థులు భాగస్వాములు కానున్నారని తెలిపారు. విద్యార్థులకు మన సంస్కృతీ, సంప్రదాయాలను తెలియజేసేలా బాలోత్సవ కమిటీ రెండు రోజుల పాటు ఉత్సాహ వాతావరణంలో వేడుకలను నిర్వహిస్తున్నదన్నారు. ఇప్పటికే ఇండస్ మాంటిస్సోరీ పాఠశాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. మొదటి రోజు ఈ కార్యక్రమానికి కలెక్టర్ రంజిత్ బాషా, జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ హాజరై పతాకావిష్కరణ చేసి వేడుకలను ప్రారంభిస్తారన్నారు. 35 రకాల ఈవెంట్లను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా తల్లిదండ్రులు ప్రోత్సాహించాలని విజ్ఞప్తి చేశారు.

9 నుంచి ఘంటసాల ఆరాధనోత్సవాలు



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తెలుగు సినీ నేపథ్య గాయకుడు, దివంగత ఘంటసాల వర్ధంతి సందర్భంగా ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రతిరోజూ సాయంత్రం 6:30 గంటలకు 'ఘంటసాల ఆరాధనోత్సవాలు' నిర్వహిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు విద్వాన్ పత్తి ఓబులయ్య, ఘంటసాల గాన కళాసమితి అధ్యక్షుడు బీఎస్ రావు తెలిపారు. టీజీవీ కళాక్షేత్రం, ఘంటసాల గాన కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల ఘంటసాల ఆరాధనోత్సవాల్లో 9న కర్నూలు గాయకులు సుధారాణి, శ్రీనివాసులు, హబీబ్ తదితరులు ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. కన్వీనర్‌గా గాయకుడు చంద్రకంటి మద్దయ్య, శ్రీనివాస రెడ్డిలు వ్యవహరిస్తారని తెలిపారు. 10న హైదరాబాదుకు చెందిన గాయకులు అఖిల, పీవీ రమణ బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి ఉంటుందని, కన్వీనర్‌గా బీఎస్ రావు వ్యవహరిస్తారని తెలిపారు. 11న హైదరాబాదు గాయకులు వాణికుమారి, వీరలక్ష్మి, పి. రవీందర్, డాక్టర్ వీఎస్ మూర్తిల బృందం ఆధ్వర్యంలో జరిగే సంగీత విభావరికి హైదరాబాదు ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కేవీ రావు కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వారు వివరించారు.

మోడు చెట్టుకు కాసిన 'కొంగలు'



తూడిచర్ల ఏబీఆర్ కాల్వ మోడువారిన చెట్టుపై కొంగలు

జూపాడుబంగ్లా, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూడిచర్ల గ్రామ సమీపంలో అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (ఏబీఆర్)కు వెళ్లే కాల్వపై మోడుబారిన చెట్టుపై కొంగలు వాలాయి. కొమ్మకొమ్మపై ఓ ఒకటి రెండు కొంగలు కూర్చొని చెట్టుకే కాశాయా అన్నట్టుగా కనిపించాయి. ఈ దృశ్యం రహదారిపై వెళ్లే వారిని కనువిందు చేస్తోంది.

శ్రీశైలం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో ఒకరి దుర్మరణం

ఆత్మకూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): శ్రీశైల క్షేత్రంలో చేపడుతున్న విద్యుద్దీకరణ పనుల్లో బుధవారం అపశ్రుతి చోటుచేసుకుంది. బోయ కృష్ణ(26) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రంలోని గద్వాల జిల్లా రామాపురం గ్రామానికి చెందిన బోయ కృష్ణ.. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో విద్యుత్ లోడ్ పెంచేందుకుగాను పోల్ టు పోల్ విద్యుత్ తీగలను మార్చే పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో దేవస్థానం ఆసుపత్రి వద్ద స్తంభం ఎక్కగా అక్కడ విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో స్తంభం పైనే ఆయన తీవ్రంగా గాయపడ్డాడు. సహచర సిబ్బంది నిచ్చెన సాయంతో కింది దించి దేవస్థానం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు. విద్యుత్ సరఫరా నిలిపివేసినప్పటికీ దేవస్థానం జనరేటర్ నుంచి రిటర్న్ సప్లై వల్ల విద్యుత్ సరఫరా జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యవహారంలో అటు దేవస్థానం అధికారులు, ఇటు విద్యుత్ శాఖ అధికారులు సమన్వయం లేకుండా ఎవరికి వారు తప్పు తమది లేదని సమర్థించుకోవడం గమనార్హం. కేసు నమోదు చేసుకున్న శ్రీశైలం వన్‌టౌన్ పోలీసులు దేవస్థానం, విద్యుత్‌శాఖ అధికారులను పిలిపించి విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

కుక్క కాటుతో బాలుడి మృతి


మోహిద్దీన్ (ఫైల్)

ఓర్వకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ గ్రామానికి చెందిన జిలానీ బాషా, రసూల్‌బీ దంపతులకు కుమారుడు మోహిద్దీన్ (12) బాలుడు కుక్క కాటుకు గురై కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. తల్లిదండ్రులు తెలిపిన వివరాలివీ.. కాల్వబుగ్గ గ్రామంలో జనవరి 9వ తేదీన తన ఇంటి వద్ద ఆడుకుంటుండగా.. కుక్క బాలుడి కాళ్లకు కరిచింది. దీంతో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే కోలుకోలేక మృతి చెందాడు.

కొండముచ్చు దాడిలో ఇద్దరికి గాయాలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కొలిమిగుండ్లలోని జమ్మలమడుగు సర్కిల్ వద్ద కొండముచ్చు మనుషులపై దాడి చేస్తుండటంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. బుధవారం సంజామల మండల రామిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ దస్తగిరి కొలిమిగుండ్ల సర్కిల్ వద్ద లారీ ఆపుకొని భోజనం కోసం హోటల్‌కు వెళ్తుండగా కొండ ముచ్చు దాడి చేసింది. దీంతో దస్తగిరి ముఖంపై తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా 20కుట్లు పడ్డాయని స్థానికులు తెలిపారు. అక్కడే చిరుదుకాణం నిర్వహిస్తున్న లక్ష్మీదేవమ్మ అనే మహిళపై కూడా దాడి చేయడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు చర్యలు తీసుకొని కొండ ముచ్చును పట్టుకుని తరలించాలని కోరుతున్నారు.


గాయపడ్డ దస్తగిరి, దాడి చేసిన కొండముచ్చు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల గ్రామ సమీపంలో మలుపు వద్ద ఆర్టీసీ బస్సు, ఓ జీపు ఢీ కొన్న ఘటనలో జీపు డ్రైవర్‌తో పాటు, ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. బుధవారం తాడిపత్రి నుంచి జమ్మలమడుగుకు వెళ్తున్న జమ్మలమడుగు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు, ట్రాలీ వాహనం ఢీకొనడంతో ట్రాలీ వాహనంలో ప్రయాణిస్తున్న అవుకు గ్రామానికి చెందిన దూదేకుల బుచ్చమ్మ, దూదేకుల బుజ్జి మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి కారణమైన బస్సు

ఉరి వేసుకుని రైతు ఆత్మహత్య

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఉరి వేసుకుని రైతు ఉప్పరి నాగరాజు (41) ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. గూడూరు పట్టణానికి చెందిన రైతు ఉప్పరి నాగరాజు ఐదెకరాలను కౌలుకు తీసుకుని కంది పంటను సాగు చేశాడు. అయితే వేసిన పంట పండకపోవడంతో నష్టం వాటిల్లింది. దాదాపు రూ.5 లక్షల అప్పులయ్యాయి. ఎలా తీర్చాలో తెలియక మదనపడుతూ గత రెండు రోజులుగా కనిపించకుండా పోయాడు. బుధవారం గూడూరు పట్టణంలోని పడమర బీసీ కాలనీ సమీపంలోగల గోడౌన్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు సమాచారాన్ని పోలీసులకు అందించారు. ఎస్ఐ తిమ్మయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతుని తండ్రి ఉప్పర నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

వై. కానాపురంలో ఇరువర్గాల ఘర్షణ

గూడూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గూడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వై. కానాపురం గ్రామంలో పొట్టేళ్ల తలకాయల కోసం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. మంగళవారం గ్రామంలో ఒక వర్గం వారు సుంకులమ్మ అమ్మవారి దేవర చేశారు. అయితే.. బుధవారం పొట్టేళ్ల తలకాయల కోసం ఇరువర్గాలు ఘర్షణ పడ్డాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ తిమ్మయ్య వై.కానాపురం చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఘర్షణ చోటు చేసుకోకుండా గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ఈ ఘర్షణపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తిమ్మయ్య తెలిపారు.

సేవా దృక్పథంతో మెలగాలి

- సత్రాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి
- శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు


మాట్లాడుతున్న శ్రీశైల దేవస్థానం ఈవో శ్రీనివాసరావు

శ్రీశైలం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో క్షేత్రానికి తరలివచ్చే భక్తుల పట్ల ఆయా సత్రాల వారు సేవా దృక్పథంతో మెలగాలని దేవస్థానం ఈవో శ్రీనివాసరావు అన్నారు. బుధవారం శ్రీశైలంలో ఆయా సత్రాల నిర్వాహకులతో ఆత్మకూరు ఆర్డీవో నాగజ్యోతి, ఎస్ఆర్‌బీసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాంభూపాల్‌రెడ్డితో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ఏడాది కంటే ఈ ఏడాది బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో సత్రాల వారు కూడా సేవా దృక్పథంతో భక్తులకు సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఇందుకు దేవస్థానం తరపున కూడా సహకారం అందిస్తామని చెప్పారు. బ్రహ్మోత్సవాల సమయంలో భక్తుల రద్దీ నేపథ్యంలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరం కలిగే అవకాశం ఉందని, ఇందుకు గానూ ముందుగానే అవసరమైన సరుకులు, ఇతర వస్తువులను సమకూర్చుకోవాలని తెలిపారు. అలాగే అన్ని సత్రాలు శుచిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, సత్రాల ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. నాణ్యమైన సరుకులు, తాజా కూరగాయలను వాడాలన్నారు. నీటి ట్యాంకులను శుభ్రపర్చుకుని నీటి నిల్వలు ఉంచుకోవాలన్నారు. భద్రతా చర్యల్లో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తహసీల్దార్ శ్రీనివాసరావు, దేవస్థానం అధికారులు ఉన్నారు.

జీరో వ్యాపారానికి చెక్


కర్నూలు మార్కెట్‌లో రైతులు విక్రయానికి తెచ్చిన వాముపొట్టు బస్తాలు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో వాముతో పాటు వాము పొట్టును రైతులు గతంలో తక్కువధరకే వ్యాపారుల చేతుల్లో పెట్టేవారు. బస్తా వాము పొట్టుకు వ్యాపారులు 100 నుంచి రూ.150లు మాత్రమే చెల్లించేవారు. కనీసం ఈ వాము పొట్టుపై సెస్సును కూడా మార్కెట్ యార్డుకు చెల్లించడం లేదు. దీంతో

క్వింటం వాము పొట్టు ధర రూ.7,269
సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

అటు రైతుల నుంచి కర్నూలు మార్కెట్ యార్డు అధికారుల కళ్లు గప్పి పెద్ద ఎత్తున వాము పొట్టు ద్వారా వ్యాపారులు జేబులు నింపుకునేవారు. ప్రస్తుతం కర్నూలు మార్కెట్ కమిటీ సెక్రటరీగా ఉన్న జయలక్ష్మి వ్యాపారుల అక్రమాలకు చెక్ పెట్టారు. ఇకపై వాము పొట్టును కూడా వ్యాపారులు టెండరులోనే రైతుల నుంచి కొనుగోలు చేయాలని, సెస్సును కూడా చెల్లించాల్సిందే అని ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యాపారుల మధ్య పోటీ పెరిగి వాము పొట్టు వల్ల రైతులకు భారీ ప్రయోజనం చేకూరడమే కాకుండా పెద్ద మొత్తంలో సెస్సు కూడా అందే అవకాశం ఏర్పడింది.

బుధవారం కర్నూలు మార్కెట్ యార్డుకు 18 క్వింటాళ్ల వాము పొట్టును రైతులు తీసుకువచ్చారు. క్వింటం వాము పొట్టు ఏకంగా గరిష్ఠ ధర రూ.7,269, మధ్యస్థ ధర రూ.1,760, కనిష్ఠ ధర రూ.501 దక్కింది. ఎన్నడూ లేనివిధంగా వాము పొట్టుపై కూడా తమకు ఆదాయం రావడంతో రైతులు సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఎండుమిరప క్వింటా గరిష్ఠంగా రూ.13,001, మధ్యస్థ ధర రూ.11,769, కనిష్ఠ ధర రూ.2,199 దక్కింది. వేరుశనగకాయలకు గరిష్ఠ ధర రూ.5,559, మధ్యస్థ ధర రూ.5,320, కనిష్ఠ ధర రూ.2,117 అందింది. ఆముదాలకు గరిష్ఠ ధర రూ.5,662, మధ్యస్థ ధర రూ.5,662, కనిష్ఠ ధర రూ.5,319 అందింది. మొక్కజొన్నలకు గరిష్ఠ ధర రూ.2,289, మధ్యస్థ ధర రూ.1,923, కనిష్ఠ ధర కూడా అదే మొత్తంలో రైతులకు చేరింది. ఉల్లిగడ్డలకు గరిష్ఠ ధర రూ.2,250, మధ్యస్థ ధర రూ.1,619, కనిష్ఠ ధర రూ.950 చొప్పున పలికింది.

దళారులను నమ్మి మోసపోవద్దు

- గిట్టుబాటు ధర అందుకోండి
- మార్క్‌ఫెడ్ డీఎం రాజు

కేంద్ర ప్రభుత్వం రైతులు పండించిన పంట ఉత్పత్తులకు మద్దతు ధర పొందేలా చర్యలు తీసుకుంటోందని మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ రాజు, నాఫెడ్ ఏపీ ఇన్‌చార్జి పీఎస్ శర్మ, డీసీఎంఎస్ మేనేజర్ రాజీవ్ అన్నారు. బుధవారం కర్నూలు మండలంలోని పంచలింగాల గ్రామంలో కందులు పండించిన రైతులకు నాణ్యతపై అవగాహన కల్పించారు. కందులకు క్వింటానికి రూ.7,550 అందించేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు.ప్రతి గ్రామంలో రైతులు పండించిన కందులను కొనుగోలు చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రైతులు దళారులు, వ్యాపారులను నమ్మి మోసపోవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

రైతుకు సాయంగా డ్రోన్‌లు


డ్రోన్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి

- గత ప్రభుత్వంలో ప్రకటనలకే పరిమితం
- ముఖ్యమంత్రి చొరవతో ముందుకు కదిలిన యంత్రాంగం
- మార్చిలోపు గ్రౌండింగ్ చేస్తామంటున్న వ్యవసాయాధికారులు

నంద్యాల ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులోభాగంగా డ్రోన్‌ల వినియోగానికి పెద్ద పీట వేసింది. వ్యవసాయానికి మరింత టెక్నాలజీని జోడించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కూలీల కొరత తీర్చేందుకు డ్రోన్‌ల ఉపయోగం ఎంతగానో దోహదపడుతుందని ప్రభుత్వం భావించి డ్రోన్‌ల వినియోగం పట్ల మరిన్ని అడుగులు ముందుకే సింది. అందుకు సరిపడా నిధులను మంజూరు చేసింది.


గత ప్రభుత్వంలో ప్రకటనలకే పరిమితం

గత వైసీపీ ప్రభుత్వంలో డ్రోన్‌ల వినియోగం కేవలం ప్రకటనలు, ఆర్భాటాలకే పరిమితమైంది. గ్రామీణ ప్రాంతంలో ఎంపిక చేసిన డ్రోన్ పైలట్లను సైతం రాజకీయం చేసి ఎలాంటి అర్హత లేని వారిని ఎంపిక చేసి, శిక్షణ పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసింది. ఎంపిక చేసిన గ్రూపులకు బ్యాంకర్‌ల నుంచి ఎలాంటి రుణ సదుపాయం కల్పించలేదు. దీంతో డ్రోన్‌ల వినియోగంపై రైతుల్లో అయోమయం నెలకొంది. కొన్నాళ్లకు ఆ ఊసే లేకుండా పోయింది.

నంద్యాల జిల్లాకు 40 డ్రోన్‌లు మంజూరు

జిల్లాలో మొత్తం 28 మండలాలు ఉండగా ప్రభుత్వం 40 డ్రోన్‌లను మంజూరు చేసింది. అందులో అవుకు, సంజామల, శిరువెళ్ల, ఆత్మకూరు మండలాలకు ఒక్కో మండలానికి రెండు డ్రోన్‌లను మంజూరు చేశారు. మిగిలిన డ్రోన్‌లను ఒక్కో మండలానికి ఒక్కటి కేటాయించారు. మరో 8 డ్రోన్‌లు ఉండగా ఎవరైనా ముందుకు వస్తే విచారించి కేటాయిస్తామని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గతంలో 30మంది పైలట్‌లుగా శిక్షణ పొందగా ప్రస్తుతం వారి నుంచి అన్ని అర్హతలు, సామర్థ్యం కలిగిన 13 మంది నిరుద్యోగ యువ కులను వ్యవసాయాధికారులు ఎంపిక చేశారు. మిగిలిన 27 మంది పైలట్‌లను ఎంపిక చేసి 10 రోజుల శిక్షణ అందించేం దుకు సిద్ధమయ్యారు. అనంతరం 80శాతం సబ్సిడీతో ఎనిమిది లక్షలకు తక్కువ కాకుండా ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనున్నారు.

మార్చిలోపు డ్రోన్‌ల పంపిణీ పూర్తి చేస్తాం



మార్చిలోపు డ్రోన్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఇప్పటికే ప్రతిపాదనలు పంపాం. రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులను తెలియజేసి వారి పెట్టుబడులను తగ్గించేలా కృషి చేస్తున్నాం. అందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలుగా సహకారం అందుతోంది. త్వరలో రైతుల పంటలపై డ్రోన్‌లు ఎగురబోతున్నాయి.

- మురళీకృష్ణ, నంద్యాల జిల్లా వ్యవసాయాధికారి

కూటమి ప్రభుత్వం
కులగణన చేపట్టాలి

- తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం
- డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహయాదవ్


మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శమని, మన రాష్ట్రంలో కూడా కూటమి ప్రభుత్వం కులగణన చేపట్టి దామాషా ప్రకారం బీసీలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన వల్ల ఎవరి జనాభా ఎంత ఉందో తేటతెల్లమైందన్నారు. దేశంలో కూడా ప్రధాని నరేంద్రమోదీ సర్కార్ కులగణన చేపట్టాలన్నారు. దేశంలో సగానికి పైగా ఉన్న బీసీలు తీవ్రంగా వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీలో కూడా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు చొరవ తీసుకుని కులగణన చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 56 శాతం బీసీలు, 17 శాతం ఎస్సీలు, 10 శాతం ఎస్టీలు అంటే దాదాపు 90 శాతం వెనుకబడిన, బలహీన వర్గాల ప్రజలే ఉన్నారన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాహుల్‌గాంధీ డిమాండ్ చేస్తుంటే బీజేపీ మాత్రం రిజర్వేషన్ల రద్దుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పఠాన్‌అబూఖాన్, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ వద్ద కలకలం

- రైతు దగ్గర ఏటీఎం కార్డు కాజేసి రూ.40 వేలు డ్రా
- వృద్ధురాలి కవర్‌ను కత్తిరించి రూ.50 వేలు చోరీ



బాధితుడి వెనకవైపు నిల్చున్న నిందితుడు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేట్ బ్యాంకు దగ్గర బుధవారం చోరీల కలకలం రేగింది. ఓ రైతు డబ్బు డ్రా చేసుకునేందుకు రాగా ఓ అగంతకుడు రైతును మాటల్లో పెట్టి ఏటీఎం కార్డును తస్కరించి మరో బ్యాంకులో రూ.40 వేలు డ్రా చేసుకున్నాడు. అదే బ్యాంకు వెనుక వైపు ఉన్న ఎస్‌బీఐ ఏడీబీ శాఖలో వృద్ధురాలు డబ్బు డ్రా చేసుకొని బయటకు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి చాకచక్యంగా నగదు ఉంచుకున్న కవర్‌ను కత్తిరించి రూ. 50 వేలు కొట్టేశాడు. వివరాలు ఇలా.. పట్టణంలోని స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ ఏటీఎం సెంటర్‌లో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో పెద్దకడు బూరు మండలం జాలవాడి గ్రామానికి చెందిన రైతు సత్యన్న ఏటీఎంలో డబ్బును డ్రా చేసుకునేందుకు వచ్చాడు. అప్పటికే ఏటీఎం సెంటర్‌లో ఉన్న ఓ అగంతకుడు రైతు సత్యన్న ఏటీఎం కార్డు తీసుకొని డబ్బు డ్రా చేసి ఇస్తున్నట్లు నటించాడు. డబ్బు రావటం లేదని రైతును ఏమార్చి కార్డును మార్చేశాడు. అనంతరం రైతు కార్డుతో ఉడాయించాడు. అగంతకుడు ఇచ్చిన కార్డును మరోసారి డబ్బును డ్రా చేసేందుకు ప్రయత్నించి డబ్బు రాకపోవటంతో బయటకు వచ్చాడు. వెంటనే సత్యన్న సెల్‌కు రూ.40 వేలు డ్రా అయినట్లు మెసేజ్ రావటంతో మోసపోయానని గుర్తించి లబోదిబోమన్నాడు. పోలీసులకు, బ్యాంకు అధికారులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పెద్దకడుబూరు మండలం హెచ్ మురవణి గ్రామానికి చెందిన వృద్ధురాలు బెనకమ్మ ఎస్‌బీఐ ఏడీబీ బ్యాంకులో రూ. 50 వేలు డ్రా చేసి, సంచిలో డబ్బును ఉంచుకొని వస్తుండగా సంచి బరువు తగ్గినట్లు అనిపించింది. సంచిని తెరచి చూడగా డబ్బు కనిపించలేదు. సంచి ఓ పక్క చిరిగి ఉండటంతో డబ్బు ఎక్కడైనా పడిందేమోనని బ్యాంకులో వెతికింది. ఎక్కడా కనిపించకపోవటంతో బోరుమంది. తనకు న్యాయం చేయాలని కోరుతోంది. ఒకే రోజు రెండు సంఘటనలు చోటు చేసుకోవటంతో ఖాతాదారులు ఉలిక్కిపడ్డారు. రైతు సత్యన్న ఏటీఎం కార్డు చోరీపై కేసు నమోదు చేశామని, వృద్ధురాలు పోగొట్టుకున్న డబ్బుపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు

రచ్చుమర్రి చోరీ కేసులో దొంగ అరెస్టు

- 47 తులాల బంగారు ఆభరణాలు, కేజీ వెండి, రూ.2.50 లక్షల స్వాధీనం


నిందితుడిని చూపుతున్న డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు

మంత్రాలయం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి గ్రామానికి చెందిన మురారి శేషాద్రి శెట్టి ఇంట్లో జరిగి దొంగతనం కేసులో అదే గ్రామానికి చెందిన బోయ దొండు నాగేంద్ర అనే నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్‌లు తెలిపారు. బుధవారం మాధవరం పోలీస్ స్టేషన్‌లో దొంగను పట్టుకుని అరెస్టు చేసి విలేకరుల సమావేశం నిర్వహించారు. గత నెల 18వ తేదీన శేషాద్రి ఇంటో చోరీ జరిగిన విషం తెలిసిందే. దీంతో బాధితుడు మాధవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి ముమ్మర దర్యాప్తు చేపట్టారు. బోయే నాగేంద్ర దొంగ అని తేలడంతో బుధవారం మాధవరం సమీపంలో అరెస్టు చేశారు. రూ.32.90 లక్షల ఆభరణాలు, వెండి విలువ రూ.ఒక లక్ష విలువైన వెండి, నగదు రూ.2.50 లక్షలు సొత్తును స్వాధీనం చేసుకున్నారు. పది రోజుల్లోనే కేసును ఛేదించడంతో సీఐ రామాంజులు, ఎస్ఐ విజయకుమార్, సిబ్బందికి రివార్డులు అందజేశారు. మాధవరం, మంత్రాలయం పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించి నగదు పురస్కారాన్ని అందజేశారు. హెడ్ కానిస్టేబుల్ వీరేష్, గురుమూర్తి, వీరాంజనేయులు, సోమశేఖర్, విజయకుమార్, రఘు, రామకృష్ణ పాల్గొన్నారు.

భార్య ఆత్మహత్య కేసులో
ఐదేళ్ల జైలు శిక్ష

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం తేవాలని నిత్యం భార్యను భర్త వేధిస్తుండడంతో వేధింపులు తట్టుకోలేక ఉరి వేసుకుని భార్య ఆత్మహత్య చేసుకుంది. ఈ కేసులో భర్తపై నేరం రుజువు కావడంతో ఆళ్లగడ్డ ఐదో జిల్లా అదనపు జడ్జి బుధవారం ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. కోవెలకుంట్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన దూదేకుల కమాల్ దూదేకుల దస్తగిరమ్మను 2013లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. అనంతరం అదనపు కట్నం తేవాలని నిత్యం భార్య దస్తగిరమ్మను కమాల్ వేధిస్తుండేవాడు. వేధింపులు తట్టుకోలేక 2016లో ఉరి వేసుకుంది. మృతురాలి తల్లి మహాలక్ష్మి ఫిర్యాదు మేరకు కోవెలకుంట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఆ కేసు ఆళ్లగడ్డ కింది కోర్టులో విచారణ జరిపించారు. భర్తపై నేరం రుజువు కావడంతో జడ్జి ఐదు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. కమాల్ ఆ తీర్పును అంగీకరించకుండా ఆళ్లగడ్డ ఐదో జిల్లా అదనపు జడ్జికి అప్పీలు చేసుకున్నారు. అక్కడ కూడా కింది బెంచ్ జడ్జి విధించిన తీర్పునే ఆయన ఇచ్చారు. బుధవారం నిందితుడు హెడ్‌కానిస్టేబుల్ క్రిష్ణనాయక్ కడప సెంట్రల్ జైలుకు అప్పగించి వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పాఠశాలల బలోపేతంపై సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం పాఠశాలల బలోపేతం - రీస్ట్రక్చరింగ్ అంశంపై నియోజకవర్గ స్పెషల్ అధికారులు, డిప్యూటీ, మండల విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ పి. రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలకు ఇబ్బందులు కలగకుండా రిస్ట్రక్చరింగ్ జరగాలని ఆదేశించారు. అవసరమున్న చోట పాఠశాలలకు అప్రోచ్ రోడ్డు ఏర్పాటుకు ఎస్టీమేట్లు తయారు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని డీఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఈవో శ్యామ్యూల్ పాల్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల, డీపీవో భాస్కర్ పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నాగన్న

ఓర్వకల్లు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పెండింగ్ ఉపాధి బిల్లులను విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు నాగన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని ఎన్.కొంతలపాడు గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలీలకు ఆరు వారాలైనా కూడా కూలి డబ్బులు రాలే దన్నారు. అలాగే పనుల వద్ద గుడారాలు, ఆరోగ్య కిట్లు, తాగునీరు అందించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఖాజావలి, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

10 నుంచి చౌడేశ్వరీదేవి జాతర

కోడుమూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చౌడేశ్వరీదేవి జాతర ఉత్సవాలు ఈనెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. 10న గుమ్మటోత్సవం, 11న ప్రభోత్సవం, 12న నంది ధ్వజసేవ, 13న రథోత్సవం, 14న తిరుగు రథోత్సవం, 15న పారువేట, 16న వసంతోత్సవంతో ఉత్సవాలు పూర్తవుతాయి. రథోత్సవంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని కమిటీ సభ్యులు చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలో క్రీడా సాంస్కృతిక కార్యక్ర మాలు చేపడుతున్నారు.


చౌడేశ్వరీదేవి అమ్మవారు

12న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కోడుమూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరిదేవి జాతరను పురస్కరించుకొని పట్టణంలో ఈనెల 12న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలు స్థానిక సంత మార్కెట్‌లో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరగనున్నాయి. కబడ్డీ పోటీల్లో గెలుపొందిన మొదటి జట్టుకు రూ.20016, రెండో జట్టుకు 10016, మూడో జట్టుకు రూ.5016 నగదును అందజేయనున్నారు. సర్పంచు భాగ్యరత్న, వార్డు సభ్యులు లింగమూర్తి బహుమతి దాతలుగా నిలిచారు.

షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు: రాయలసీమ జోన్ స్థాయిలో ఓపెన్ షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 12న ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జగనున్నాయి. ఈ నెల 12న ఉదయం 8గంటలకు స్లో సైకిల్ రేస్ పందేలు ప్రారంభం కానున్నాయి. అలాగే విజేతలకు నగదు బహుమతలు అందజేయనున్నారు. ఉదయం 10గంటలకు దీక్ష స్కూల్‌లో చందరంగం పోటీలను నిర్వహించనున్నారు. ఇందులో జూనియర్స్, సీనియర్ విభాగం విభజించి పోటీలను నిర్వహించనున్నారు. జూనియర్ విభాగంలో 15 సంవత్సరాల లోపు ఉన్న వాళ్ల మాత్రమే పాల్గొనే అవకాశం కల్పించారు. ఇందులో గెలుపొందిన మొదటి విజేతకు రూ.2016, రెండో విజేతకు రూ.1016 నగదును కోడుమూరు నివాసి, ప్రస్తుతం సత్యసాయి జిల్లా ముది గుప్ప సీఐగా విధులు నిర్వహిస్తున్న శ్యామారావు బహుమతి దాత గా నిలిచారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఈనెల 12న ఉదయం జూనియర్స్ సీనియర్స్‌కు వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నారు. జూనియర్స్ విభాగంలో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు, సీని యర్స్ విభాగంలో ఇంటర్మీడియట్ విద్యార్థులు పాల్గొనే విధంగా అవకాశం కల్పించారు. ఇందులో గెలుపొందిన మొదటి ఆరుగురికి బహుమతులు అందజేయనున్నారు.

'కోళ్ల పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలి'

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కోళ్లు చనిపోకుండా పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలని పశుసంవర్థకశాఖ జేడీ శ్రీనివాస్ ఓ ప్రకటనలో సూచించారు. పెరటి కోళ్లతో పోలిస్తే పౌల్ట్రీ ఫారాల్లో అధికంగా కోళ్లు మరణిస్తున్నట్లు గుర్తించారని, ఇప్పటిదాకా కర్నూలు జిల్లాలో కోళ్ల మృతి ఘటనలు ఎక్కడా కనిపించలేదని తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా కొల్లేరు సరస్సు ప్రాంతానికి ఈ ఏడాది వలస పక్షులు అధికంగా రావడం వల్లనే ఆ ప్రాంతంలో కోళ్ల మృతికి కారణమైందని ప్రభుత్వం గుర్తించినట్లు తెలిపారు. పౌల్ట్రీ ఫారాలు నిర్వహిస్తున్న యజమానులు జీవ భద్రతా చర్యలు పాటించకపోవడంతో కొన్ని చోట్ల వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయన్నారు. ఎప్పటికప్పుడు వారు సరైన పరిశుభ్రత, పశువైద్యుల సలహాల మేరకు చర్యలు తీసుకుంటే కోళ్లకు ఎటువంటి వ్యాధులు సంక్రమించవని తెలిపారు. ఉడికించిన గుడ్లు, కోళ్ల మాంసాన్ని వినియోగదారులు ఆహారంగా తీసుకోవచ్చని, ఈ విషయంలో ఆందోళన వద్దని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ కోరారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన ద్వారా ప్రభు త్వానికి లేఖ ద్వారా విన్నవించారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కుల గణన ఎస్సీ వర్గీకరణ దేశానికి ఆదర్శమని ఇదో సాహసోపేతమైన చారిత్రాత్మక ఘట్టమని ఈ సర్వే యావత్ భారతావనికి దిక్సూచిగా నిలుస్తుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఆరోగ్యశాఖ మంత్రి రాజనరసింహలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ తరఫున అభినందనలు తెలిపారు. శాసన మండలిలో మంగళవారం ప్రవేశపెట్టిన జస్టిస్ షమీర్ అక్తర్ కమిషన్ సామాజిక, ఆర్థిక, విద్యా ఉద్యోగ, రాజకీయాల్లో ప్రాతినిధ్యం ఆధారంగా అత్యంత వెనుక బడిన కులాలకు ఇది ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో కూడా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని కోరారు.

ఎక్స్‌రే తీయరే..

● చెడిపోయిన రేడియోగ్రఫీ మిషన్
● పట్టించుకోని అధికారులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో రెండు రోజులుగా పాత రేడియా లజీ విభాగంలో డిజిటల్ రేడియోగ్రఫీ మిషన్ చెడిపోయింది. వీటి మరమ్మతుల గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. దీంతో పాత రేడియాలజి విభాగం నుంచి రోగులు ఎక్స్‌రేల కో సం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు బారులు తీరారు. రద్దీ పెరగడంతో గంటల తరబడి రోగులు ఎక్స్‌రేల కోసం పడిగాపులు కాశారు. పాత రేడియాలజీలో చెడిపోయిన డీడీఆర్ యంత్రానికి మరమ్మతులు చేయాల్సిన సైరెక్స్ సంస్థ ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. కేవలం చిన్న చిన్న పరికరాలను మా త్రమే మరమ్మతులు చేస్తూ చేతులు దులుపుకుంటుంది.


న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌లో ఎక్స్‌రే కోసం వేచి చూస్తున్న రోగులు

ఉదయం 9 గంటలకు వచ్చా..



మెడ నొప్పితో బాధపడుతూ ఉదయం 9 గంటలకు ఆర్తో ఓపీ తీసుకుని వెళ్లగా.. వైద్యులు ఎక్స్‌రే రాసిచ్చారు. వెంటనే ఎక్స్‌రే కోసం వచ్చాను. పాత రేడియాలజీ దగ్గరకు వెళితే.. పని చేయ డం లేదన్నారు. కొత్త బ్లాక్ దగ్గరకు వస్తే చాలా మంది ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట దాటినా ఎక్స్‌రే తీయలేదు.
- స్వాములు, పారుమంచాల, జూపాడుబంగ్లా, మండలం

రెండు గంటలైనా ఎక్స్‌రే తీయలేదు..



ఎంఎంలో అడ్మిషన్ అయ్యాను. ఎక్స్‌రే కోసం ఉదయం న్యూడయోగ్నస్టిక్ బ్లాక్‌కు వచ్చారు. రెండు గంటలు దాటినా ఎక్స్‌రేలు తీయడం లేదు. రద్దీ ఎక్కువగా ఉందని నిలబడలేక ఇలా నేలపై కూర్చున్నారు.
- రవికుమార్, రోగి

జీవో 143ని రద్దు చేయాలి

● సీఎంకు పోస్టుకార్డు పంపించిన ఉద్యోగులు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో తెచ్చిన జీవో.నెం.143ను వెంటనే రద్దు చేయాలని తెలుగునాడు మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఎం.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా వైద్యఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట రాష్ట్ర కమిటి పిలుపు మేరకు జీవో.నెం.143ని రద్దు చేయాలని కోరుతూ పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో.నెం.143 వల్ల ఉద్యోగుల మిగులు పేరుతో అన్ని సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంల ఉద్యోగుల కుదింపు చేశారన్నారు. ఈ కారణంగా 450 కిపైగా ఎంపీహెచ్ఈవో పోస్టులు వేయికి పైగా ఎంపీహెచ్ఏ మేల్ అండ్ ఫీమేల్, 300కు పైగా పీహెచ్ఎన్, సీనియర్ జూనియర్ అసిస్టెంట్లు, ఎల్‌డీ కంప్యూటర్లు, ఎఫ్ఎన్‌వో వంటి అన్ని కేడర్లు కలిసి దాదాపు 2వేలకు పైగా పోస్టులు రద్దు అయ్యాయనీ ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల భవిష్యత్తులో ఏఎన్ఎంలతో సహా అన్ని కేడర్లకు పదోన్నతుల అవకాశాలు ఉండవని, ఉద్యోగాలు రద్దు అవుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన జీవో అమలు కావడం వల్ల ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, తక్షణమే ఆ జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.మాధవరాజు, నాయకులు ప్రకాష్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


సీఎంకు రాసిన పోస్టుకార్డుతో తెలుగునాడు వైద్య ఉద్యోగులు

కూటమి ప్రభుత్వంలో సంక్షేమం పరుగులు

తడకనపల్లెలో అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడు తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. బుధవారం కల్లూరు మండలం తడకనపల్లెలో ఎమ్మెల్యే పర్యటించి సీసీ రోడ్లు, గోకులంషెడ్లు, చెరువుకు నీటి విడుదల పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గౌరు చరిత మాట్లాడుతూ ఎన్నికల్లో రైతులకు తడకనపల్లె చెరువు నింపుతానని హామీ ఇచ్చామని, ఈ మేరకు చెరువుకు నీరు నింపామని అన్నారు. అదేవిధంగా ఉపాధి హామీ నిధులు రూ.21.5 లక్షలతో 5 రోడ్ల ఏర్పాటుకు భూమిపూజ చేశామన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో మూడు ఏళ్లుగా చెరువుకు నీరు నింపకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. కార్యక్రమంలో ఏపీ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డి.రా మాంజనేయులు, పునులూరు ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, మైనర్ ఇరిగేషన్ డీఈ నాగరాజు, పంచాయతీరాజ్ డీఈ నాగిరెడ్డి, ఏఈ రవిమోహన్‌రెడ్డి, ఏపీఓ మద్దీశ్వరమ్మ, కాంట్రాక్టర్ సుల్తాన్‌మియా, జనసేన నాయకుడు సలాం, ఐటీడీపీ హుసేన్, మహిళా సంఘం మండల అధ్యక్షురాలు జేబేదాబీ పాల్గొన్నారు.

ఆసుపత్రి ఏడీకి అభినందనలు

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ (ఏడీ)గా కొత్తగా బాధ్యతలు చేపట్టిన వై.మల్లేశ్వరమ్మకు ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు బాలు నాయక్, రాష్ట్ర కార్యదర్శి అబ్రహాం, రాష్ట్ర కోశాధికారి సురేష్ ఏడీకి నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్జెంట్ ఉరుకుందయ్య, శశిరెడ్డి, సుందర్‌రాజు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలి


ఎస్ఈకి వినతి పత్రం ఇస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

కల్లూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని పట్టణపౌర సంక్షేమ సంఘం నాయకుడు ఇరిగినేని పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఎస్ఈ ఎం.ఉమాపతిని కలిసి సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా పుల్లారెడ్డి మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుతో చేతివృత్తులతో జీవనం సాగించే ప్రజలు పనులు సాగించే అవకాశం లేకుండా పోతుం దన్నారు. నగరంలోని అజాముద్దీన్ కాలనీకి చెందిన 60504 మీటర్‌పై గతంలో మూడు వేల కరెంట్ బిల్లు వచ్చేదన్నారు. ప్రస్తుతం డిసెంబరులో రూ.30 వేలు, ఫిబ్రవరిలో రూ.29 వేల 525 బిల్లు వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పెద్దపాడుకు చెందిన మౌలాలి సర్వీస్ నెంబర్ 83224000954కు గతంలో 6వేల బిల్లు వచ్చేదని ప్రస్తుతం 22 వేలు, 28 వేలు వస్తుందని ఆరోపించారు. కార్యక్రమంలో మొయిద్దీన్, మోహన్ రావు, మహమ్మద్ యూనిస్, శశికుమార్‌రెడ్డి, నాసిర్‌ఖాన్ పాల్గొ న్నారు.

అశ్విని హాస్పిటల్‌లో అరుదైన చికిత్స

కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అశ్విని హాస్పిటల్ లో ఓ గర్భిణి అరుదైన ఆపరేషన్‌ను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. 24 వారాల గర్భిణికి కవలలు.. కానీ మాయ ఒకటే. ఇలా కవలలకు ప్రత్యేకంగా మాయ ఉంటుంది. కానీ ఒకే మాయ ఉన్న గర్భిణికి ట్విన్‌టూ ట్విన్ ట్రాన్స్‌ఫ్యూజన్ అనే సమస్య వచ్చింది. ఈ సమస్యకు వైద్యులు ఫిటోస్కోపి పద్ధతి ద్వారా లేసర్‌ను ఉపయోగించి రెండు గంటలు శ్రమించి ఆదివారం ఆపరేషన్ చేశారు. పాండిచ్చేరి నుంచి డాక్టర్ మణికందన్, కర్నూలు చెందిన ఫీటల్ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ గాయత్రీ ఇండ్ల (లోటస్ స్కాన్), డాక్టర్ స్ఫూర్తి ఆపరేషన్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అశ్విని హాస్పిటల్ గైనకాలజీ హెచ్‌వోడీ డాక్టర్ బి.ప్రమీల మాట్లాడుతూ ఇలాంటి కేసు రాష్ట్రంలో మొట్టమొదటిదని గతంలో ఇలాంటి కేసు లను చెన్నై, బెంగళూరు, బొంబాయికి పంపించేవారమని, కానీ ఈసారి అశ్విని హాస్పిటల్‌లో విజయవంతంగా నిర్వహించామన్నారు.


బాలింతతో వైద్యులు

'చౌకబారు మాటలు మానుకో..'

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జ్వాలాపురం శ్రీకాంత్ చౌకబారు ప్రకటనలు చేయడం మానుకోవాలని తెలుగుదేశం పార్టీ బ్రహ్మణ సాధికార కమిటీ నాయకుడు ఎన్ వెంకటరామరాజు హితవు పలికారు. బుధవారం నగరంలోని తన నివాసంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయంలో దేవదాయ శాఖ సలహాదారుడిగా ఆయన చేసిన అక్రమాలను ప్రభుత్వం వెలుగులోకి తీసుకురావాలని కోరారు. వైస్ జగన్‌ను కలిసి అర్చకులు, బ్రాహ్మణులపై జరిగిన దాడులకు గతంలో స్పందించకుండా ఇప్పుడు మాట్లాడం విడ్డూరంగా ఉందన్నారు.

స్వయం ఉపాధిని సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలోని బీసీ, ఈబీసీ (కమ్మరెడ్డి, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ) కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాల నుంచి స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కమిషనర్ ఎస్. రవీంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరంలో సంబంధిత కులాల లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల నుంచి సబ్సిడీ మంజూరు చేస్తారన్నారు. దరఖాస్తుదారులు ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా పేరును ఆన్‌లైన్‌లో ఈనెల 7వ తేదీ లోగా నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు బీసీ కార్పొరేషన్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఏటీసీ ట్రాక్ సెంటర్లను రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రవాణ శాఖ కార్యాలయాలను ప్రైవేటు సంస్థలకు అప్పగించకుండా ఏటీసీ ట్రాక్ సెంటర్లను రద్దు చేయాలని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ నగర ఉపాధ్యక్షుడు డి.కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా పరిషత్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలు ఏర్పాటు చేస్తున్న ఆటో మేటిక్ టెస్టింగ్ స్టేషన్ సెంటర్లను ఏర్పాటు చేయరాదన్నారు. సెన్సార్ ఫిట్‌నెస్ ట్రాకులను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటస్వామి, నూర్‌బాషా, గోపాలక్రిష్ణ, నాగరాజు, బి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రహదారులను పరిశుభ్రంగా ఉంచాలి: కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగరంలోని రహదారులను పరిశుభ్రంగా ఉంచాలని కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. బుధవారం ఆయన 19వ వార్డు జొహరాపురం రహదారి, చంద్రశేఖర్‌నగర్, సరస్వతి నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి పలు రహదారులు, మురుగు కాలువలను పరిశీలించారు. అంత కుముందు కొండయ్య గేట్, గాంధీనగర్, ధర్మపేట, కాలనీల్లో పారిశుధ్య పనులను కమిషనర్ తనిఖీ చేశారు. కొండారెడ్డిబురుజు సమీపంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రహదారులపై పరిశుభ్రత పనులను చేప ట్టాక, వెంటనే వ్యర్థాలను అక్కడి నుంచి తరలించాలని సూచించారు. ఆయన వెంట ఆరోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హుస్సేన్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

● నూతన ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీకి కమిషనర్ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.


డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

వైభవంగా సూర్యనారాయణ స్వామి కల్యాణం


మాంగళ్యాన్ని చూపుతున్న అర్చకులు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): నగర శివారు గుత్తి రోడ్డులోని సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో మూడు రోజులుగా కొనసాగుతున్న దేవస్థానం 6వ వార్షికోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు సూర్యనారాయణ స్వామి వారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా, వేద మంత్రోచ్చారణల మధ్య కల్యాణ వేడుకలను నిర్వహించారు.

హరిహర క్షేత్రంలో పూజలు: సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో లక్ష్మీ వేంకటేశ్వర స్వామివార్ల 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం స్వామి, అమ్మవా ర్లకు పూజలు నిర్వహించారు. బుధవారం భీష్మాష్టమిని పురస్కరించుకొని వేకువ జామున స్వామి వారికి, అమ్మవార్లకు అభిషేకాలు, అలంకరణ సేవ, అర్చనలు, మహా మంగళహారతి, స్వామివారికి ప్రసాద నివేదన చేశారు. అనంతరం భక్తుల సమక్షంలో వేద పండితులు నవగ్రహ హోమం చేశారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సింహ వాహనంపై ఉంచి నగర వీధుల్లో ఊరేగించారు. నగర బ్రాహ్మణ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సందేల్ చంద్రశేఖర్, నాగులవరం రాజశేఖర్, గౌరవాధ్యక్షుడు సీవీ దుర్గాప్రసాద్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): దళిత యువతి అత్యాచార ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రావణి డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మహిళలపైన హత్యాచార సంఘటనలు విచ్చలవిడిగా జరుగుతున్న వాటిని అరికట్టడంలో అక్కడి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, మునెమ్మ, రేణుక, పావని పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసిన ఎంపీ

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను నివాసంలో ఎంపీ కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా కర్నూలు జిల్లా అభివృద్ధికి సహకరించాలని ఎంపీ కోరారు.

మత్స్యకారులందరికీ సహకార సంఘాల్లో సభ్యత్వం

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): తమ వృత్తిగా చేపలవేటను కొనసాగిస్తున్న వారందరికీ మత్స్య సహకార సంఘాల్లో సభ్యత్వం కల్పిస్తామని జిల్లా మత్స్య సహకార సంఘం చైర్మన్ నవీన్ కుమార్ హామీ ఇచ్చారు. బుధవారం కర్నూలు నగరంలోని బంగారు పేటలో మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న సంఘం కార్యాలయంలో చైర్మన్ నవీన్ కుమార్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మత్స్యకారులు కలిసి వినతి పత్రం అందజేశారు. నవీన్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసమే పని చేస్తోందన్నారు. సమావేశంలో మత్స్యకారుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు అవగాహన సదస్సు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఫార్మసీ విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ మాట్లాడుతూ ఫార్మసీ కోర్సుకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. ఫార్మసీ కోర్సులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం: సీపీఎం


కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు రూరల్ ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరిగిందని సీపీఎం మండల కార్యదర్శి పీబీ హుస్సేనయ్య అన్నారు. సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కర్నూలు మండలం గొం దిపర్ల గ్రామంలో నాయకులు నిరసన వ్యక్తం చేసి, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ బిల్లులను దహనం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులకు ఈ బడ్జెట్‌తో ఎలాంటి ఉపయోగం లేదన్నారు. నాయకులు ఆంజనేయులు, శ్రీరాములు, చంద్రన్న, మునిస్వామి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

గూడూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని సీఐ టీయూ డివిజన్ కార్యదర్శి జే.మోహన్ అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో మండల నాయకుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ధర్నా చేశారు. జే.మోహన్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పెట్టుబడి దారులకు కొమ్ము కాస్తుందన్నారు. నాయకులు రాజశేఖర్, దానమన్న, కొమ్ము రాజు, చిన్న రాజు, శాంతన్న పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి ఆదేశించారు. బుధవారం సచివాలయంలో జరుగుతున్న వివిధ పథకాలపై పత్తికొండ, కర్నూలు మండలాల ఎంపీడీవోలతో జూమ్ సమావేశం నిర్వహించారు. మిస్సింగ్ సిటిజన్స్, ఎన్‌సీసీఏ, ఈకేవైసీ తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలిచ్చారు.

నేడు ఉద్యోగ మేళా

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బి.తాండ్రపాడులోని ఎస్‌జీపీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం పాలటెక్నిక్ ఫార్మసీ విభాగంలో మెడ్‌ప్లస్ ఆధ్వర్యంలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్ బుధవారం తెలిపారు. డి.ఫార్మసీ, బీ.ఫార్మసీ, లేదా డిగ్రీలో ఏ కోర్సు చేసిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు ఉదయం 10.30 గంటలకు కళాశాలలో హాజరు కావాలని ఆయన కోరారు.

బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-16 యూత్ బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు సంఘం ప్రతినిధి దాదాబాషా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత శాఫ్ డైరెక్టర్ నాగరాజు పాల్గొని మాట్లాడుతూ క్రీడాకారులు బాస్కెట్‌బాల్ క్రీడల్లో రాణించాలన్నారు. ఆర్‌ఎం కళాశాల వ్యాయామ డైరెక్టర్ వెంకటేష్, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిందు సేద్యంతో అధిక లాభాలు

హాలహర్వి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బిందు సేద్యంతో అధిక లాభాలు వస్తాయని ఏవో శివశంకర్ అన్నారు. బుధవారం మోదాహల్, కామినహల్ గ్రామంలో జరిగిన పొలంబడి నిర్వహించారు. ఈ పద్ధతిలో రైతులకు పెట్టుబడి తగ్గుతుందని, డ్రిప్ పరికరాలను 90 శాతం రాయితీతో ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్,ప్రింటర్, మైక్రోస్కోప్ అందజేస్తున్న మేనేజర్

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంక్ మేనేజర్ సోమన్న కంప్యూటర్, ప్రింటర్, మైక్రోస్కోప్‌ను బుధవారం అందజేశారు. సీఎస్ఆర్ నిధుల కింద సహకరించామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మేనేజర్‌ను సన్మానించారు. బ్యాంక్ మేనేజర్ హరీష్, ఇన్‌చార్జి హెచ్ఎం సుధాకర్ బాబు, ఉపాధ్యాయులు రంగారెడ్డి, ప్రహ్లాద, జాన్ విక్టర్, అనిల్, లోక్యా నాయక్, వెంకటేష్ పాల్గొన్నారు.

గ్రామాలు మారుతున్నాయి..

- సీసీ రోడ్డుగా మారిన గుంతల రహదారి
- హర్షం వ్యక్తం చేస్తున్న రామలింగాయపల్లె వాసులు



మురుగు గుంతలా ఉన్న రోడ్డు



నూతన సీసీ రోడ్డు, మురుగు కాలువలు

తుగ్గలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలు మారుతున్నాయి, ఇప్పుడే అభివృద్ధి చెందుతున్నాయి. గతంలో ఎంతోమంది అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోలేదని కూటమి ప్రభుత్వం రాగానే సీసీ రోడ్డు నిర్మించిందని గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చెన్నంపల్లి పంచాయతీ మజరా గ్రామం రామలింగాయపల్లె ప్రధాన రహదారి గుంతల మయంగా ఉండింది.

చిన్న వర్షం పడితే చాలు మోకాళ్లలోతు నీరు నిల్వ ఉండటంతో ఇబ్బంది పడేవారమని, పడుతూ, లేస్తూ రాకపోకలు సాగించేవారమని గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ దారిలోనే దాదాపు పది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. గతంలో కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే శ్యాంబాబు రూ.50లక్షలను మంజూరు చేసి, సీసీ రోడ్డు, మురగు కాలువలు ఏర్పాటు చేశారు. దీంతో రహదారి బాగు పడటంతో పాటు మురుగునీరు కూడా ఊకి బయటకు వెళ్లడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రూ.కోటి అభివృద్ధి పనులు చేశాం



కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే శ్యాంబాబు సహకారంతో రూ.కోటి నిధులతో అభివృద్ధి పనులు చేశాం. రామలింగాయపల్లె, చెన్నంపల్లి, కేపీ గుడిసెల్లో దాదాపు సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించి, కొళాయిలకు కూడా మరమ్మతులు చేశాం. - **వెంకటపతి, చెన్నంపల్లి, పంచాయతీ సలహాదారు**

గతంలో కంపు.. ఇప్పుడు లేదు



రహదారిపై ఆటోల కోసం వేచి ఉండాలంటే మురుగు రోడ్డుపైనే ఉండటంతో కంపు కొట్టేది. నేడు సీసీ రోడ్డు, మురుగు కాలువలు ఏర్పాటు చేయడంతో బస్టాండు, పరిసర ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉన్నాయి.
- మల్లికార్జున, రామలింగాయపల్లె

బాధితుల పట్ల మర్యాదగా ఉండాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్

వెల్దుర్తి/టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. బుధ వారం వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌ను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. మండలంలోని ఫ్యాక్షన్ గ్రామాలపై దృష్టి పెట్టాలని ఆదేశంచారు. పాత బైకులను పరిశీలించి యజమానులకు ఇచ్చేయలన్నారు. దిశా వాహనాలకు మరమ్మతులు చేయించుకోవాలన్నారు. స్టేషన్‌కు వాహనం లేదని చెప్పడంతో తర్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. సీఐ మధుసూదన్‌రావు, ఎస్ఐ అశోక్‌కుమార్ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

ఆరోగ్యంపై జాగ్రత్త అవసరం

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బాలికలకు తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరమని మాస్టర్ ట్రైనర్ సంధ్యారాణి అన్నారు. బుధవారం నెహ్రూ మెమోరియల్ ఉన్న పాఠశాలలో ఆరోగ్య పరిరక్షణ ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్స్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అవగాహన లేక మార్కెట్‌లోని వివిధ రకాల శానిటరీ ప్యాడ్లు వాడి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్గానిక్ శానిటరీ ప్యాడ్‌లను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ డివిజన్ అధికారి జోనాథన్ వీక్లిప్, ఉపాధ్యాయులు ప్రకాషమ్మ, పద్మావతి, సువేదమ్మ, అపర్ణ పాల్గొన్నారు.

ఎస్సీలుగా నమోదు చేయొద్దు

ఆలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మాదాసి, మదారి కురువలను పాఠశాలల్లో హెచ్ఎంలు ఎస్సీలుగా నమోదు చేయవద్దని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ తాలూకా నాయకులు రామాంజినేయులు, నరసప్ప డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో కులగణ సర్వేలో వలంటీర్లు సచివాలయ సిబ్బంది మాదాసి మదారి కురువలుగా సర్వేలో చూపించారన్నారు. దీనిపై దళిత సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేయడం ప్రభుత్వం స్పందించి ఆ సర్వేను రద్దు చేసిందన్నారు. ఇంకా కొందరు మాదసి, మాదారి కురువలు పాఠశాలల్లో తమ పిల్లలను ఎస్సీలుగా నమోదు చేయమని ఒత్తిడి చేస్తున్నారని ఈ విషయంపై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

సంత మార్కెట్‌కు వెళ్లాలి

ఆలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న వ్యాపారులు సంత మార్కెట్‌కు వెళ్లాలని పంచాయతీ ఈవో ప్రకటించారు. బుధ వారం ఆంధ్రజ్యోతిలో 'అదుపు లేని వాహనాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి స్పందించారు. మైక్‌లో ప్రచారం చేసి హెచ్చరించారు. జాతీయ రహదారి కావడంతో వాహనాలు అదుపు తప్పి ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు.

ఐటీ మినహాయింపు పెంపు అభినందనీయం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో ఆదాయ పన్ను మినహాయింపు పరిధి పెంపు అభినందనీయమని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్ బుధవారం అన్నారు. ఉద్యోగులకు రూ.12.5లక్షలు, ఇతరుల కు రూ.12లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపుతో వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ రైల్వే బడ్జెట్‌లో రూ.9,417కోట్లు కేటాయించారని, రాష్ట్రంలో రైల్వే అభివృద్ధి చెందుతుందన్నారు.

మట్టిని తరలిస్తే చర్యలు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాలు, వంకలు, చెరువలు, పరంపోగు స్థలాలను నుంచి అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ ఎంఎ రమేష్ హెచ్చరించారు. బుధవారం కార్యాలయంలో మాట్లాడు తూ జేసీబీ వినియోగిస్తే రూ.లక్ష, ట్రాక్టర్లకు రూ.25వేలు జరిమానా విధిస్తామన్నారు. రెండోసారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లు గ్రామంలో కారు ఢీ కొని ఇరువురికి గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన శివ, హనుమంతు బైక్‌పై రోడ్డు దాటుతుండగా, వికరాబా ద్‌కు చెందిన కారు ఢీకొంది. వీరిని ఆదోని ఏరియాసుపత్రికి తరలించారు. డ్రైవర్ రామచంద్రను అదుపులోకి తీసుకుని, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దతుంబళం ఎస్సై మహేష్ కుమార్ తెలిపారు.

ఉచిత విద్య ఇవ్వాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వలసల కార్మికుల పిల్లలకు పని ప్రదేశంలోనే ఉచిత విద్య ఇవ్వాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి క్రాంతి నాయుడు కోరారు. బుధవారం అమరావతిలో మంత్రి లోకేశ్‌ను కలిశారు. సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు.



మంత్రి లోకేశ్‌ను సన్మానిస్తున్న క్రాంతి నాయుడు

అతిథి గృహానికి మహర్దశ



కొనసాగుతున్న నూతన గెస్ట్‌హౌస్ పనులు

ఆలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రిటీష్ కాలం నాటి ఆలూరు ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి మహర్దశ వచ్చింది. కూటమి ప్రభుత్వం రూ.3.50కోట్లు మంజూరు చేయడతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఆధునిక వసతులు, నాలుగు గదులు, కాన్ఫరెన్స్ హాల్‌ను నిర్మిస్తున్నట్లు ఆరు నెలల్లో పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సాయి సురేష్ తెలిపారు.

అదరికీ ఉపాధి పనులు

ఆలూరు రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పనులు కావాలని అడిగిన వారందరికీ కల్పిస్తామని ఎంపీడీవో సయ్యద్ మహబూబ్ బాషా అన్నారు. బుధవారం ఆలూరు ఉపాధి కార్యలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలసలను నివారించి కూలీలకు పనులు కల్పిస్తామని అన్నారు. కూలీల హాజరు శాతం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీవో శ్రీనివాసులు, ఈసీ మారన్న, టెక్నికల్ అసిస్టెంట్లు ఈరన్న, నాగేశ్; రామేష్, గాదెప్ప పాల్గొన్నారు.

10న వైద్య శిబిరం

మద్దికెర, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 10న గ్రామంలోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచే సినట్లు తహసీల్దార్ హుశేన్ సాహెబ్, ఆపద్బాంధవ సేవా సమితి వ్యవస్థా పకుడు చొక్క సునీల్ కుమార్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ సినీ నటుడు ఎస్వీప్రసాద్ జ్ఞాపకార్థం కిమ్స్ సవేరా నిర్వహిస్తున్నామని గుండెనొప్పి, ఆయాసం, కళ్లు తిరడం, ఈసీజీ, టుడీఎకో వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు శిబిరం ఉంటుందన్నారు. జన విజ్ఞాన వేదిక కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ పాల్గొనానరు.



కరపత్రాలను విడుదల చేస్తున్న తహసీల్దార్

దాతల సహకారంతో పాఠశాల నిర్మాణం ప్రారంభం

వెల్దుర్తి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎయిడెడ్ పాఠశాల భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామ పెద్దలు బొమ్మన నరేంద్రనాథ్ రెడ్డి, బొమ్మన దశరథరామిరెడ్డి 30 సెంట్ల స్థలాన్ని ఇస్తామని మాట ఇచ్చారు. అందుకు గానూ బుధవారం పాస్టర్ యేసేపు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు చేసి పనులను ప్రారంభించారు. ఎయిడెడ్ పాఠశాల ఏబీఎం చర్చికి చెందినదని, దాతలను సంప్రదించగా 30 సెంట్ల స్థలం ఇచ్చారని, ఖర్చులు కూడా భరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల ఏబీఎం చర్చి పాస్టర్ రవికుమార్, పాఠశాల ఉపాధ్యాయురాలు రూతమ్మ, ఏబీఎం చర్చి సంఘం సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న గ్రామస్థులు, పాస్టర్లు

మోడల్ స్కూల్‌లో చోరీ యత్నం

ఆస్పరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి విఫలయత్నం చేశారు. వాచ్‌మన్ ఆంజనేయ తెల్లవారుజామున 5 గంటల వరకు విధుల్లో ఉండి కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన సమయంలో దుండగులు ఓగది తలపు గడియను ధ్వంసం చేశారు. ఉదయం వాచ్‌మెన్ గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అయితే ఎటువంటి సామాగ్రి చోరీ గురి కాలేదని త్వరలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రిన్సిపాల్ సమీల తెలిపారు.



ధ్వంసమైన డోరు గడియ

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

ఆలూరు, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్సై దిలీప్ కుమార్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ పరిమితికి మించి ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులు వెళ్లకుండా కట్టడి చేస్తున్నామన్నారు. డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డు సైడ్ వ్యాపారులు సంత మార్కెట్‌లోకి వెళ్లాలని గతంలోనే సూచించామన్నారు.

బైకులు ఢీకొని ముగ్గురికి గాయాలు

దేవనకొండ, ఫిబవరి 5 (ఆంధ్రజ్యోతి): తెర్నేకల్ -బైలుపల్ల గ్రామాల మధ్య బుధవారం తెల్లవారుఝామున రెండు బైకులు ఢీ కొని ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. ఆస్పరి మండలం తొగలగల్లుకు చెందిన గంగన్న, మల్లికార్జున బైక్‌పై తెర్నేకల్‌కు వస్తుండగా, మరోవైపు తెర్నేకల్ నుంచి గంజెళ్లకు వెళ్తున్న యువకుడి బైకు ఢీ కొన్నాయి. క్షతగాత్రులను కర్నూలుకు తరలించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

దేవనకొండ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పెంచికలపాడు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ లక్కందిన్నె గ్రామానికి చెందిన తిప్పక్క(65) మృతిచెందింది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. పి.కోటకొండ గ్రామానికి చెందిన సురేష్ ,అమ్మమ్మ తిప్పక్కతో కలసి నాగలాపురం సుంకులమ్మవ్వని దర్శనం చేసుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో పెంచికలపాడు వద్ద ఆగివున్న లారీని వీరి బైక్ ఢీకొనడంతో సురేష్ అక్కడిక్కడే మృతి చెందగా, త్రీవంగా గాయపడ్డ తిప్పక్కను మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. అయితే కోలుకోలేక బుధవారం మృతి చెందింది. దీంత కుటుంబంలో విషాదచాయలు అములుకున్నాయి.

బడ్జెట్‌లో వ్యవసాయానికి అన్యాయం

- వామపక్షాలు, వ్యవసాయ సంఘం నిరసన

ఆదోని రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి మొండిచెయ్యి చూపారని వామపక్ష నాయకులు లింగన్న, బసాపురం గోపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధ వారం పాండవగల్లు ప్రధాన రహదారిలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు బీజేపీ రైతులు, కార్మికులు, వ్యవసాయానికి వ్యతిరేకంగా, పెట్టుబడి దారులకు అనుకూలంగా ఉందన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేశారు.



దేవనకొండలో బిల్లులను దహనం చేస్తున్న నాయకులు

లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

దేవనకొండ: కార్మికుల పొట్టకొట్టే లేబర్‌కోడ్ బిల్లులను రద్దు చేయాలని సీపీఐ, సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బస్టాండ్ ఆవరణలో అందోళన చేశారు. కార్మిక సంఘం నాయకులు వీరశేఖర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద బిల్లుల పత్రులను దహనం చేశారు. బడేసాబ్, రాఘవేంద్ర, లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

రైతు, కార్మిక సంఘాల నిరసన

పత్తికొండ టౌన్: కేంద్ర బడ్జెట్‌తో రైతులు, కార్మికులకు ప్రయోజనం లేదని రైతు, వామపక్ష నాయకులు అన్నారు. బుధవారం పత్తికొండలో ధర్నా చేసి, నిరసన తెలిపారు. రైతు సంఘం కార్యదర్శి సురేంద్ర కుమార్, ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు కృష్ణ, దస్తగిరి మాట్లాడుతూ బడ్జెట్ కార్పొరేట్‌కు అనుకూలంగా ఉందని, కార్మికులను నిరాశ పరిచిందన్నారు. నాయకులు వెంకటేశ్వరరెడ్డి, కారన్న, ఎంకే సుంకన్న, రాజప్ప, నెట్టికంటయ్య, గోపాల్, సిద్ధయ్య పాల్గొన్నారు.

వెల్దుర్తి: కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దుచేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. వెల్దుర్తి కార్యాలయం వద్ద నిరసన తెలిపి, తహసీల్దార్ చంద్రశేఖరవర్మకు వినతి పత్రం అందజేశారు.

రద్దు చేయాలి..

ఆస్పరి: పార్లమెంటులో ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ఐటీయూసీ కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసన తెలుపుతామన్నారు. స్వాతంత్ర్యానికి ముందు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కోవిడ్ కాలంలో దుర్మార్గంగా పార్లమెంటులో చర్చ లేకుండానే రద్దు చేసిందన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ బోనస్ కనీస వేతనాలను అధోగతి పట్టించిందన్నారు చంద్రశేఖర్, బ్రహ్మయ్య, ఉరుకుందప్ప, రామయ్య, మల్లికార్జున, కృష్ణ, తాయన్న, వీరశేఖర్, రంగస్వామి పాల్గొన్నారు.

రెండోసారీ..

- రోండోరోజూ వాయిదా పడ్డ మండల సమావేశం
- ప్రజాప్రతినిధులు, అధికారుల గైర్హాజరు



బుధవారం ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

తుగ్గలి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం బుధవారం రెండోరోజు కూడా కోరమ్ లేక వాయిదా పడింది. ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు కూడా గైర్హాజరయ్యారు. మంగళవారం మొదటి రోజు వాయిదా పడిన విషయం విదితమే. అయితే బుధ వారం ప్రజాప్రతినిదులు, సర్పంచులతో పాటు అధికారులు, కూడా గైర్హాజరయ్యారు. ఎంపీడీవో విశ్వమోహన్, ఈవోఆర్‌డీ శ్రీహరితో పాటు మరో నలుగురు అధికారులు మాత్రమే సమావేశంలో కనిపించారు. ఇక చేసేదేమీ లేక ఎంపీడీవో మరో 15 రోజులకు సర్వసభ్య సమావేశం వాయిదా వేశారు. కాగా 17 మంది ఎంపీటీసీలు ఉన్నా ఎందుకు హాజరుకావడం లేదని, ఇలా ఉంటే అభివృద్ధి ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

నరసింహస్వామికి మహాభిషేకం

● లోక కల్యాణార్థం పూజలు చేసిన పీఠాధిపతి

● మంత్రాలయంలో భక్తుల సందడి


నరసింహస్వామికి అభిషేకం చేస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు లోక కల్యాణార్థం కోసం షోడశబాహు (పదహారు చేతులు) నరసింహస్వామికి బంగారు నాణేలతో మహాభిషేకం చేశారు. బుధవారం భీష్మ అష్టమి శుభ దినాన్ని పురస్కరించుకుని పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యం లో రాఘవ్రేంద్రస్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. పీఠాధిపతి స్వహస్తాలచే పూర్ణ బోధ పూజ మందిరంలో ఏడాదికి ఒక్కసారి జరిగే షోడశబాహు నరసింహస్వామికి మహాభిషే కం చేశారు. అలాగే మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో విశేష అభిషేకం చేసి హారతులిచ్చారు. వివిధ రథాలపై ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. ఉత్సవమూ ర్తికి ఊంజలసేవ నిర్వహించి హారతులిచ్చారు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో సందడిగా మారింది.

బీసీ రెసిడెన్షియల్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీసీ రెసిడెన్షియల్ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహేంద్రబాబు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక న్యూడెమోక్రసీ కార్యాలయంలో పట్టణ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేంద్రబాబు మాట్లాడుతూ ఎమ్మిగనూరు చుట్టు పక్కల మూడు నియోజకవర్గ కేంద్రాలు ఉన్నా బీసీ రెసిడెన్షియల్ హాస్టల్ లేకపోవడంతో విద్యార్థులు చదువుకునేందుకు దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందన్నారు. తక్షణమే పాలకులు, అధికారులు స్పందించి ఎమ్మిగనూరులో బీసీ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, భరత్, నరసింహ, రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

నందవరం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంలో మాజీ ఎంపీటీసీ తిమ్మరాజు తల్లి ఎలుకూరి నరసమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి నందవరంలోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. నరసమ్మ భౌతికకాయానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హనుమంతు చిత్రపటానికి నివాళి

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): సీపీఐ (ఎం.ఎల్) కార్యాలయంలో రామన్న గౌడ్ సహచరుడు ఏనుగుబాల హనుమంతు ప్రథమ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. రైతు కూలీ సంఘం, ఎఫ్‌టీయూ నాయకులు నరసన్న, ప్రసాద్, ఏసేపులు అనీఫ్, స్వామి దాస్, గుళికన్న, చార్లెస్, రాజోళ్ళప్ప, రామచంద్ర, నీలకంఠ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కౌతాళం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ అమరేశ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరై గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావాలన్నారు. మండలంలోని ఆయా శాఖల అధికారులు కూడా పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని తెలిపారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అనాథ మృతదేహానికి పూలే సొసైటీ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించి మానవత్వం చాటుకున్నారు. అనాథ వృద్ధుడు ఉదయం చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి ఓపీ తీసుకున్నాడు. అదే సమయంలో ఆయాసం ఎక్కువ అవ్వడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఆస్పత్రి అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వగా అతడి వివరాలు ఏమి లేకపోవడంతో అనాథ వ్యక్తిగా గుర్తించి పూలే సొసైటీకి సమాచారాన్ని ఇచ్చారు. పూలే, అంబేడ్కర్ సొసైటీ వ్యవస్థాపకుడు సింగనేటి నరసన్న, డైరెక్టర్ యు రాము, డా కామళే గణేష్, ఎమ్మిగనూరు శ్మశాన వాటికలో అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ లింగన్న, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

గంజహళ్లిలో ఎల్ఈడీ బల్బులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): గంజహళ్లి గ్రామంలోని వీధిలోని విద్యుత్ స్తంభాలకు రెండురోజులుగా ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేసినట్లు గ్రామ కార్యదర్శి వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలో బడేసాహెబ్ ఉరుసు సందర్భంగా వీధుల్లోని స్తంభాలకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

వాహనదారులకు లైసెన్స్ తప్పనిసరి

గోనెగండ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ పొంది ఉండాలని సీఐ గంగాధర్ అన్నారు. బుధవారం సాయంత్రం గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్‌రోడ్డు దగ్గర వాహనతనిఖీ చేపట్టారు. వాహనదారుల దగ్గరు ఏప ధ్రువీకరణ పత్రాలు ఉన్నాయి? ఆర్‌సీ, డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నాయా లేదా? అని పరిశీలించారు. అలాగే వాహనాలలో ఏమైనా అనుమతిలేని వస్తువులను రవాణా చేస్తున్నారా అనే అనుమానంతో వాహనాలను కూడా తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణికులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ గంగాధర్

కార్మిక హక్కులను కాలరాస్తే ఊరుకోం

● సీఐటీయూ నాయకులు


లేబర్ కోడ్ ప్రతులను దహనం చేస్తున్న సీఐటీయూ నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకోమని సీఐటీయూ నాయకులు జయరాజు అన్నారు. బుధవారం అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తూ కేంద్ర బడ్జెట్, లేబర్ కోడ్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటీష్ పాలనలో పెద్ద ఎత్తున పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల స్వేచ్ఛను కేంద్ర ప్రభుత్వం అణగదొక్కుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి భీమేశ్వరి, అంగన్‌వాడీ కార్మికులు శ్వేత, ప్రమీల, భవన నిర్మాణ కార్మికులు లక్ష్మన్న, ఇజ్రాయేలు, సురేష్, వీరన్న, మారెప్ప, ప్రాణేష్, అనిల్ కుమార్ పాల్గొన్నారు.

కోసిగి: కోసిగి వాల్మీకి సర్కిల్‌లో బుధవారం సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, అంగన్‌వాడీ సంఘం నాయకులు హెబ్సిబారాణి, లూసమ్మ, వరలక్ష్మి, కేవీపీఎస్ నాయకులు హనుమంతు, ఆటో యూనియన్ నాయకులు చిన్నన్న, చిన్నారెడ్డి పాల్గొన్నారు.

నందవరం: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసర ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ నాయకులు రాముడు, ఉరుకుందు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగ్యలక్ష్మి, భాగ్యమ్మ, రామలింగమ్మ, వెంకటేశ్వరమ్మ, కోదండ, చిన్నఏసున్న, తిమోతి, శివ, జయన్న, ఆనందు, వెంకటస్వామి, బజారి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: కార్మికులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని వామపక్ష సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేపట్టి లేబర్ కోడ్ జీవో ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు పంపన్నగౌడు, తిమ్మగురుడు, గోవిందు, రాముడు, కేసీ జబ్బార్, నరస య్య, బజారి, విజయేంద్ర, మహేంద్ర, దాదావలి, మల్లికార్జునగౌడు, సురేష్ పాల్గొన్నారు.




కోసిగిలో ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, నందవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

పార్కుల అభివృద్ధిపై దృష్టి సారించాలి


మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కుల అభివృద్ధిపై దృష్టిసారించాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశించారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ గంగిరెడ్డి వివిధ రకాల ఫౌంటెన్‌లను ఎమ్మెల్యే బీవీకి స్క్రీన్‌పై చూపించారు. పార్కుల అభివృద్ధి, రహదారులకు సంబంధించిన వెల్‌కమ్ బోర్డులు, ఫుట్‌పాత్‌లపై, సౌకర్యాల ఏర్పాటును అడిగి తెలుసుకున్నారు. వెంటనే అభివృద్ధి పనులను ప్రారంభించి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం సామాజిక సేవా కార్యకర్త మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, జనసేనా నాయకులు నాగరాజు ఎమ్మెల్యేను కలిసి పూలమాలలు వేసి సన్మానించారు. దివ్యాంగులు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు.

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) పట్టణ కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా రాము, కార్యదర్శిగా విజయ్, సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప, నాయకులు గోవిందు, సురేష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను పూర్తిగా ప్రైవేట్, కార్పొరేట్ చేతికి అప్పగించి నిర్వీర్యం చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఫీజు రియింబర్స్‌మెంటు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న సుమాల ఆంథోని

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలని కేజీబీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుమాల ఆంథోని, గోవిందు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాటికాపరుల జీవనశైలి భిన్నంగా ఉంటుందని అన్నారు. బతుకు దుర్భరంగా మారిందన్నారు. ప్రభుత్వం గుర్తింపు కార్డులు ఇచ్చే బ్యాంకు రుణాలు, ప్రత్యేకమైన పింఛన్ సదుపాయం కల్పించాలని కోరారు. ప్రతీ గ్రామంలో శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కేజీబీఎస్ నాయకులు మద్దిలేటి, ఆనంద్, ఏసన్న పాల్గొన్నారు.

విచారించి చర్యలు తీసుకోవాలి


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న తెలుగు యువత నాయకులు

గోనెగండ్ల, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న వెలుగు సిబ్బంది ఏపీఎం, సీసీ, బుక్ కీపర్‌లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తెలుగు యువత మండలఅధ్యక్షుడు రంగస్వామి నాయుడు, సందీప్‌నాయుడు, జయపాల్, టీఎన్ఎస్ఎఫ్ తాలుకా అధ్యక్షుడు నాగరాజు కోరారు. బుధవారం ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీఎం, సీసీల ప్రోద్బలంతో మండలంలోని కొందరు బుక్‌కీపర్లు పొదుపు గ్రూపుల సభ్యులకు తెలియకుండా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. పొదులు గ్రూపు సభ్యుల కోసం ప్రభుత్వం ఇచ్చే శ్రీనిధి నిధులను కొందరు బుక్ కీపర్లు సంఘాలలో ఉన్న సభ్యుల పేర్లపై నగదు తీసుకొని బయట వ్యక్తులకు వడ్డీలకు ఇచ్చి అక్రమంగా సంపాదిస్తున్నారని వారు అన్నారు. విచారణ జరిపి అవినీతికి పాల్పడుతున్న బుక్ కీపర్‌లపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు ప్రభాకర్ నాయుడు, వినోద్‌కుమార్‌గౌడ్, నరసింహుడు, మల్లేష్, పెద్దయ్య అంపన్న, మునిస్వామి, ప్రభుదాస్ పాల్గొన్నారు.

చిన్న పిల్లల ఎదుగుదలపై జాగ్రత్త తీసుకోవాలి


గర్భిణులకు సూచనలిస్తున్న వైద్య సిబ్బంది

కోసిగి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే చిన్నపిల్లల శారీరక ఎదుగుదలపై జాగ్రత్తలు పాటించాలని ఎంఎల్‌హెచ్‌పీ యువరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కాత్యాయని అన్నారు. బుధవారం ఈసీసీఈ డే సందర్భంగా కోసిగిలోని షెల్టర్-2 కింద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలలో అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ కాత్యాయని మాట్లాడుతూ ప్రతినెల 5న పిల్లల ఎత్తు, బరువుపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పుట్టిన పిల్లలకు ఆరునెలల వరకు తల్లి పాలతో పాటు అదనపు ఆహారం ఇవ్వాలన్నారు. బాలామృతం వంటి పౌష్టికాహారం రోజుకు 100 గ్రాముల దాకా ఇవ్వాలని, అప్పుడే పిల్లలు శారీరకంగా ఎదుగుతారన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు లూసమ్మ, వరలక్ష్మి, దేవి, జ్యోతి, భీమలింగమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతంపై సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో బుధవారం పాఠశాలల బలోపేతం - రీస్ట్రక్చరింగ్ అంశంపై నియోజకవర్గ స్పెషల్ అధికారులు, డిప్యూటీ, మండల విద్యాశాఖల అధికారులతో కలెక్టర్ పి.రంజిత్ బాషా సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్ల లకు ఇబ్బందులు కలగకుండా రిస్ట్రక్చరింగ్ జరగాలని ఆదేశించారు. అవసరమున్న చోట పాఠశాలలకు అప్రోచ్ రోడ్డుఏర్పాటుకు ఎస్టిమేట్లు తయారు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని డీఈవోను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఈవో శ్యామ్యూల్ పాల్, కర్నూలు, పత్తికొండ ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నాగశివలీల, డీపీవో భాస్కర్ పాల్గొన్నారు.

వైభవంగా దేవర

మంత్రాలయం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూగూరు గ్రామంలో మారెమ్మ, దేవమ్మల గ్రామ దేవర వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి ప్రారంభమైన ఉత్సవాలు బుధవారం రాత్రి వరకు జరిగాయి. గ్రామ దేవతలకు అభిషేకాలు, పూజలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మంది భక్తులు ఉత్సవాలకు తరలిరావడంతో సూగురు గ్రామ వీధుల్లో భక్తులతో కిక్కిరిసింది. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు, సీఐ రామాంజులు, మంత్రాలయం, మాధవరం ఎస్ఐలు శివాంజల్, విజయకుమార్‌లు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.

నందవరం: మండల పరిధిలోని జగ్గాపురంలో దేవర ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. గ్రామంలో వెలసిన దేవమ్మ, మారెమ్మ ఆలయాల్లో భక్తులు ఉదయం నుంచే నైవేద్యం సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. రెండు ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, రైస్‌మిల్ నారాయణరెడ్డి, టీడీపీ మండల పార్టీ కన్వీనర్ డీవి రాముడు, వలీ, నదికెరవాడి వీరేష్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీదేవి, గడంగం నరసింహులు, గట్టాల రంగన్న, తిమ్మప్ప, ఎల్ఐసీ గోపాల్, టీడీపీ నాయకులుం పాల్గొన్నారు.

దేవర ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని సిరాలదొడ్డి, కడివెళ్ల, వెంకటగిరి, కందనాతి తదితర గ్రామాల్లో బుధవారం దేవర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే అర్చకులు దేవతామూర్తులకు జలాభిషేకం, పుష్పాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని భక్తులు కుంభాలతో నైవేద్యాలను తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. కడివెళ్ల, సిరాలదొడ్డి గ్రామాల్లో జరిగిన దేవర ఉత్సవాల్లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


సజ్జలగుడ్డంలో కుంభాలతో వస్తున్న మహిళలు


అమ్మవారికి నైవేద్యాలను తీసుకెళ్తున్న భక్తులు

కోసిగి: మండల పరిధిలోని సజ్జలగుడ్డం, మజరా గ్రామమైన దేవరబెట్ట గ్రామంలో బుధవారం మారెమ్మ దేవర వేడుకలను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామంలోని పెద్దలు మారెమ్మ దేవికి గంగాజలాలతో అభిషేకాలతో పాటు కుం కుమార్చన, ఆకుపూజ, పుష్పాలంకరణతో అమ్మవారికి నైవేద్యాలు సమ ర్పించి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకుర్తి దివాకర్ రెడ్డి వేర్వే రు సమయాల్లో దర్శించుకుని పూజలు చేశారు.


జగ్గాపురంలో ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి

సాగు చేస్తున్న భూములను రైతులకే ఇవ్వాలి


తహసీల్దారుకు వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి చెందిన భూములను తరతరాలుగా సాగు చేస్తున్న రైతులకే హక్కులు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డీవీ భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దారు ఎస్ రవికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా 50 ఎకరాల భూమిని పేద రైతులు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. పరిస్థితుల్లో రైతుల పేర్లను తొలగించి పూర్తి హక్కులు రాఘవేంద్రస్వామి మఠానికి చెందేటట్లు మార్పులు చేశారని ఆరోపించారు. వేదపాఠశాలోని విద్యార్థులు మృతి చెందిన వారికి ఇంతవరకు ఆర్థికసాయం చేయకపోవడంతో విచారకరమని అన్నారు. రైతులు అనుభవిస్తున్న భూములను లాక్కుంటే సీపీఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున్న ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు లక్ష్మన్న నాయక్, గాబ్రియేలు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి


డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి, ఎంపీఈవో సంఘం నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంపీఈవోలుగా పని చేస్తున్న తమ సమస్యలు పరిష్కరించాలని, శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి న్యాయం చేయాలని ఎంపీఈవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బసవరాజు కోరారు. ఎంపీఈవో సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో ఎంపీఈవో సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంపీఈవోలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు తిప్పేస్వామి, మధుగౌడు, వర్ధన్, అనిల్, రవి, రామ్మోహన్ రెడ్డి, చెన్ననాయక్, సతీష్, శ్రీను, శ్యాం, అంజిబాబు, రసూల్, భవాని, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్


తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రైతుల, ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్ కలెక్టర్ మౌర్యా భరద్వాజ్ అన్నారు. బుధవారం ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదోని సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని గదులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలు అంశాలపై చర్చించి, సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషఫణి, డీటీ వీరేంద్రగౌడు, సిబ్బంది ఉన్నారు.

మంత్రాలయానికి పాదయాత్ర


పాదయాత్రతో మంత్రాలయానికి వస్తున్న భక్తులు

మంత్రాలయం, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటకలోని హోస్పేట్ సమీపంలోని హంలిగి గ్రామానికి చెందిన దాదాపు 600 మంది భక్తులు పాదయాత్రతో బుధవారం సాయంత్రం చేరుకున్నారు. ఆయా గ్రామాల నుంచి ఈనెల 2న వృద్ధులు, మహిళలు, పురుషులు, చిన్నపిల్లలు 180 కి.మీలు నడుచుకుంటూ మంత్రాలయానికి చేరుకున్నారు. ఇలా 15ఏళ్లుగా మొక్కుబడిగా పాదయాత్రతో వచ్చి రాఘవేంద్రస్వామిని దర్శించుకుంటామని పాదయాత్ర మండలి సభ్యులు తెలిపారు. మంత్రాలయంలో ఊరేగింపు నిర్వహించి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులు పొందారు.